ANN తెలుగు
Follow: @ANNTELUGU
01-01-2026
మహా పత్రిక
గురువారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 8 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

హ్యాపీ న్యూ ఇయర్
న్యూజిలాండ్ లో మొదలై కేక పెట్టిన సంబరాలు
హైదరాబాద్, విజయవాడలోనూ ధూంధాం సెలబ్రేషన్స్

మహా : 2026 సంవత్సరం వచ్చేసింది. న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ వరల్డ్ వైడ్ గా ధూంధాంగా జరుగుతున్నాయి. న్యూజిలాండ్ దేశం మొట్టమొదటగా న్యూ ఇయర్ కు గ్రాండ్ వెల్ కం చెప్పింది. 2026 సంవత్సరం.. అర్ధరాత్రి 12 గంటలకు సంబరాన్ని అంటే సంబరాలతో న్యూజిలాండ్ జనం గ్రాండ్ సెలబ్రేషన్స్ చేశారు. ఆక్లాండ్ లోని స్కై టవర్ దగ్గర అబ్బురపరిచే బాణాసంచా వెలుగులు జనాన్ని మైమరిపించాయి. ఈ స్కై టవర్ దగ్గర వాటర్ ఫ్రంట్ పార్టీలు, లైట్ షోలు ఆకట్టుకున్నాయి. హ్యాపీ న్యూ ఇయర్ అంటూ న్యూజిలాండ్ వాసులు కేకలు, అరుపులతో స్కై టవర్ ఏరియా మార్మోగింది.

మిగతా 2లో



టాప్ న్యూస్

ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి
న్యూ ఇయర్ విషెస్
- తెలంగాణ రైజింగ్ విజన్ 2047 లక్ష్య సాధన దిశగా ముందుకు

02

రాష్ట్ర ప్రజలకు
కేసీఆర్ శుభాకాంక్షలు
- నూతన సంవత్సరంలో రెట్టించిన పట్టుదలతో బీఆర్ఎస్

02

తెలంగాణ ఉద్యోగులకు
గుడ్‌న్యూస్
- పెండింగ్ బిల్లులు విడుదల
- రూ.713 కోట్ల విడుదల భట్టి ఆదేశాలు

02

పట్నం పోరుకు సై

ఈ నెలాఖరులోనే నోటిఫికేషన్.. ఫిబ్రవరి 15 కల్లా పూర్తిచేసే ప్లాన్

ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్న అధికారయంత్రాగం

(హైదరాబాద్ - మహా)

పంచాయతీ ఎన్నికల్లో సూపర్ డూపర్ విక్టరీ కొట్టిన కాంగ్రెస్ సర్కార్ మున్సిపల్ పోరుకు సై అంటోంది. స్కూళ్లకు పరీక్షల సీజన్ మొదలయ్యేలోపే అంటే ఫిబ్రవరి రెండోవారం నాటికి ఎన్నికలు పూర్తయ్యేలా చూడాలని ప్రభుత్వం భావిస్తోంది. జనవరి చివరికల్లా అన్నివిధాలుగా ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి.. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల కమిషన్ కు సూచించినట్లు తెలుస్తోంది. ఆదిశగా ఏర్పాట్లు చకచక సాగుతున్నాయి. రాష్ట్రంలోని 117 మునిసిపాలిటీలు, ఆరు కార్పోరేషన్లలో ఎన్నికల ప్రక్రియ మొదలైంది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఓటర్ జాబితా సవరణ కు రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసింది. డిసెంబర్ 30వ తేదీ నుంచి 2026 జనవరి 10వ తేదీ వరకు ఓటరు జాబితా తయారీకి ఎస్ఈసీ కసరత్తు చేయనుంది. 117 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్ల (నిజామాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, కరీంనగర్, కొత్తగూడెం, రామగుండం)లో ఓటర్ జాబితా తయారీ ప్రక్రియ మొదలైంది. కేంద్ర ఆర్థిక సంఘం నుంచి పట్టణ స్థానిక సంస్థలకు దాదాపు రూ.700 కోట్ల నిధులు రావాల్సి ఉంది. వీటిని సాధించుకోవాలంటే వచ్చే మార్చిలోగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఈ ఏడాది జనవరి చివర్లో పాలకవర్గాల గడువు ముగిసింది. అప్పటి నుంచి స్పెషల్ ఆఫీసర్ల పాలనలో మున్సిపాలిటీలు కొనసాగుతున్నాయి. వచ్చే ఫిబ్రవరితో జీహెచ్ఎంసీ పాలకవర్గం, వచ్చే మే నెలతో వరంగల్, ఖమ్మం, సిద్దిపేట, అచ్చంపేట, జడ్చర్ల, కొత్తూరు, నకిరేకల్‌లాంటి పాలకవర్గాల గడువు ముగియనుంది. జీహెచ్ఎంసితో కలిపి వీటిని నిర్వహించే అవకాశాలున్నాయి.

ముఖ్యమంత్రి వ్యూహం

పంచాయతీ పోరులో కాంగ్రెస్ దుమ్మురేపింది. అంచనాలకు మించి ఫలితాలను సాధించి గ్రాండ్ విక్టరీ కొట్టింది. పల్లెపల్లెనా మూడురంగుల జెండా ఎగిరింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ హవా బలంగా వీస్తోందని, ప్రభుత్వ ప్రజాపాలన ప్రజలను మెప్పించిందని సీఎం రేవంత్ రెడ్డి గుర్తించారు. అందుకే ఇదే జోష్ లో పట్నం పోరును కూడా కంప్లీట్ చేయాలని ఆయన భావిస్తున్నారు. పంచాయతీ ఎన్నికలకు ఏమాత్రం తీసిపోకుండా మున్సిపల్ పోరులోనూ హిట్ కొట్టేందుకు రెడీ అయ్యారు. సాధ్యమైనంత త్వరగా పట్టణ స్థానికసంస్థల ఎన్నికలను పూర్తి చేయాలన్న ఆలోచనతో ముఖ్యమంత్రి ఉన్నట్లు చెబుతున్నారు. ముఖ్యంగా స్కూళ్లకు పరీక్షల సీజన్ మొదలయ్యేలోపే అంటే ఫిబ్రవరి రెండో వారం నాటికి ఈ ఎన్నికలు పూర్తి అయ్యేలా చూడాలని ప్రభుత్వం భావిస్తోంది. జనవరి మూడోవారం నాటికి అన్ని విధాలుగా ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు సూచించినట్లు తెలుస్తోంది. దాంతో అధికారులు సంబంధిత ఏర్పాట్లు మొదలుపెట్టారు. నూతనంగా ఏర్పడిన వాటితో కలిసి ప్రస్తుతం రాష్ట్రంలో జీహెచ్ఎంసీతో కలిపి 8 కార్పొరేషన్లు, 125 మున్సిపాలిటీలు ఉన్నాయి. ఫిబ్రవరితో గడువు ముగిసిపోనున్న జీహెచ్ఎంసీతో కలిపి మిగతా అన్ని పట్టణ స్థానిక సంస్థలన్నింటికీ ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే ఎలా ఉంటుందనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఆదిశగానూ సంప్రదింపులు జరుగుతున్నట్లుగా తెలుస్తోంది. జీహెచ్ఎంసిని మూడు భాగాలుగా చేసి మరో సమయంలో ఎన్నికలు జరపాలనుకుంటే ఫిబ్రవరిలో పంచాయతీ పోరు జరిగే అవకాశాలున్నాయి.

నిధుల వరద

పట్నం పోరును పరిగణన లోకి తీసుకుని సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే నిధుల వరదను పారిస్తున్నారు. అభివృద్ధి విషయంలో నో కాంప్రమైజ్ అంటున్నారాయన. ఆదిశగానే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పట్టణ స్థానిక సంస్థల్లో అభివృద్ధి పనులను సర్కారు చేపట్టింది. దీనికోసం ఏకంగా రూ.2,780 కోట్లు విడుదల చేసింది. జీహెచ్ఎంసీ మినహా మిగతా అన్ని పట్టణస్థానిక సంస్థలకు వీటిని విడుదల చేశారు. ఈ నిధుల ద్వారా 2,432 పనులు చేపట్టనున్నారు. ఇవేకాకుండా కొత్తగా ఏర్పడ్డ మున్సిపాలిటీకి రూ.15 కోట్లు, శివార్లలోని గ్రామ పంచాయతీలను విలీనం చేసుకున్న మున్సిపాలిటీలకు రూ.20 కోట్లు, కొత్తగా ఏర్పడిన కార్పొరేషన్లకు రూ.30 కోట్ల చొప్పున అదనంగా మంజూరు చేయడం గమనార్హం. నిధులు విడుదల చేయడంతో పట్నాలు అభివృద్ధి పనులు జోరందుకున్నాయి. కేంద్ర పథకాల ద్వారా రావాల్సిన రాష్ట్ర వాటా నిధులు రప్పించేందుకు కూడా అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఒకేసారి పెద్దఎత్తున నిధులు మంజూరు కావడంతో రాష్ట్రంలోని పట్టణస్థానిక సంస్థల్లో అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయి. ముఖ్యంగా రోడ్లు, డ్రైనేజీ పనులు చకచక సాగుతున్నాయి. అభివృద్ధి జనం కళ్ల ముందు స్పష్టంగా కనిపిస్తోంది. ఆ స్థాయిలో పనులు ఊపందుకున్నాయి. జనవరి చివరి నాటికి ఈ పనులన్నీ కొలిక్కి తేవాలని ప్రభుత్వం భావిస్తోంది.

తెలంగాణ ఉద్యోగులకు గుడ్‌న్యూస్

పెండింగ్ బిల్లులు విడుదల

రూ.713 కోట్ల విడుదలకు భట్టి ఆదేశాలు

హైదరాబాద్, మహా : ప్రభుత్వ ఉద్యోగులకు రేవంత్ సర్కార్ గుడ్‌న్యూస్ చెప్పింది. పెండింగ్ బిల్లుల్లో డిసెంబర్‌కు సంబంధించి రూ.713 కోట్లు బుధవారం విడుదల చేసింది. ఉద్యోగ సంఘాలకు ప్రతినెల రూ.700 కోట్ల చొప్పు రిలీజ్ చేస్తామని గతంలో రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క డిసెంబర్ నిధులు విడుదల చేయాలని ఆర్థిక శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గత కొన్నేళ్లుగా ఉద్యోగుల గ్రాట్యుటీ, సరెండర్ లీవ్‌లు, జీపీఎఫ్, అడ్వాన్స్‌లకు సంబంధించి పెండింగ్ బిల్లులు పేరుకుపోయాయి. ఇవి దాదాపు రూ.10 వేల కోట్లకు చేరాయి. ఈ క్రమంలోనే ఉద్యోగ సంఘాలు జూన్‌లో ఆందోళనకు సిద్ధమయ్యాయి. దీంతో ప్రతినెలా రూ.700 కోట్ల చొప్పున రిలీజ్ చేస్తామని ప్రభుత్వం తెలిపింది. మొదటిసారిగా జూన్ నెలాఖరులో రూ.183 కోట్లు రిలీజ్ చేసింది. అనంతరం ఆగస్టు నుంచి రూ.700 కోట్ల చొప్పున రిలీజ్ చేస్తూ వస్తోంది.

రాష్ట్ర ప్రజలకు కేసీఆర్ శుభాకాంక్షలు

నూతన సంవత్సరంలో రెట్టించిన పట్టుదలతో బీఆర్ఎస్

హైదరాబాద్, మహా: నూతన సంవత్సరంలో, వ్యవసాయ, సాగునీటి రంగాలు గాడినపడి..అభివృద్ధి చెందాలని, తెలంగాణ రైతాంగం, మహిళలు, సకల జనులు, సుఖసంతోషాలతో జీవించాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆకాంక్షించారు. తెలంగాణ ప్రజా ప్రయోజనాలను కాపాడేందుకు చిత్తశుద్ధితో, రాజీలేని పోరాటం చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ, నూతన సంవత్సరంలో రెట్టించిన పట్టుదలతో తమకు ప్రజలు అప్పగించిన బాధ్యతను నిర్వహిస్తుందని కేసీఆర్ తెలిపారు.

కేసీఆర్ కు ఉపనేతల థ్యాంక్స్

శాసన సభలో, శాసన మండలిలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్లుగా అవకాశం కల్పించిన సందర్భంగా ఎర్రవెల్లి నివాసంలో పార్టీ అధినేత కేసీఆర్‌ని మర్యాదపూర్వకంగా కలిసి హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. , ఎమ్మెల్సీలు ఎల్ రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ఉపనేతలుగా ఛాన్స్ ఇచ్చినందుకు థ్యాంక్స్ చెప్పారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ కూడా కలిశారు.

హ్యాపీ న్యూ ఇయర్

(మొదటిపేజీ తరువాయి)

స్కై టవర్ దగ్గర కొత్త సంవత్సర వేడుకలు చూడటానికి లక్షల మంది జనం తరలివచ్చారు. ఇండియన్ టైం ప్రకారం బుధవారం సాయంత్రం 4 గంటల 30 నిమిషాలకే అక్కడ.. కొత్త సంవత్సరం ప్రారంభం అయ్యింది. ప్రపంచంలోనే కొత్త ఏడాది ఆక్లాండ్ సిటీలోనే మొదలవుతుంది.

హైదరాబాద్ లో ధూంధాం

హైదరాబాద్‌లో కొత్త సంవత్సరం 2026 సెలబ్రేషన్ ప్రారంభమైంది. నగర ప్రజలు పలు ప్రాంతాల్లో కుటుంబాలతో, స్నేహితులతో కలిసి పార్టీలు చేసుకుంటున్నారు. బార్లుపబ్‌లు ప్రత్యేక ఈవెంట్స్‌తో నిండిపోయాయి.

విజయవాడలోనూ

విజయవాడలో న్యూఇయర్ సెలబ్రేషన్స్ ఎన్నడూలేని రీతిలో జరిగాయి. కొత్త సంవత్సరానికి గ్రాండ్‌గా విజయవాడ ప్రజలు వెల్ కమ్ చెప్పారు. న్యూఇయర్ సందర్భంగా నగర వ్యాప్తంగా వివిధ రకాల కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మంగళగిరి సీకే కన్వెన్షన్ వేదికగా భారీ ఇండోర్ కాన్సర్ట్ నిర్వహించారు. అలాగే విజయవాడ పోరంకి మురళీ రిసార్ట్‌స్‌లో మెగా సెలబ్రేషన్ కార్యక్రమం నిర్వహించారు. అనేకమంది సెలబ్రిటీస్, ఆర్టిస్ట్‌లు ఈ ప్రోగ్రామ్స్‌కు హాజరయ్యారు.

ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి న్యూ ఇయర్ విషెస్

తెలంగాణ రైజింగ్ విజన్ 2047 లక్ష్య సాధన దిశగా ముందుకు

హైదరాబాద్, మహా: తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రైజింగ్ విజన్ 2047 లక్ష్య సాధన దిశగా ఈ ఏడాదిలో రాష్ట్ర ప్రభుత్వం మరింత ముందుకు సాగుతుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులతో పాటు మహిళలు, కార్మికులు సహా అన్ని వర్గాల ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. కొత్త సంవత్సరంలో ప్రతి కుటుంబం తాము ఆశించిన ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని, ప్రజలందరూ ఆనందంతో, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు.

జానారెడ్డిని కలిసిన సీఎం రేవంత్

ఇటీవల మోకాలి శస్త్ర చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జానారెడ్డి ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ఆయన నివాసంలో పరామర్శించారు.

మాజీ ముఖ్యమంత్రికి అయ్యప్ప ప్రసాదం...

అందించిన టిఆర్ఎస్వి కార్యదర్శి రాజ్ కుమార్

రంగారెడ్డి జిల్లా మహా: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు రాజ్ కుమార్ అయ్యప్ప ప్రసాదం అందించారు. గత నెలలో అయ్యప్ప మాల ధరించిన రాజ్ కుమార్, నియమ ఇష్టాలతో భక్తిశ్రద్ధలతో 41 రోజుల పాటు దీక్ష చేపట్టిన సందర్భంలో, కేరళలో కొలువుదీరిన అయ్యప్ప దర్శనం కోసం వెళ్లిన ఆయన, ఐదు రోజుల క్రితం శబరిమల దర్శనం చేసుకున్న ఆయన తిరిగి స్వగ్రామం చేరుకున్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును, బుధవారం తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన, టిఆర్ఎస్వి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి రాజ్ కుమార్, శబరిమల శ్రీశ్రీ అయ్యప్ప స్వామి ప్రసాదాన్ని అందజేశారు.

2025లో 199 అవినీతి కేసులు నమోదు

273 మంది నిందితులను అరెస్టు చేసిన ఏసీబీ

అవినీతి ఫిర్యాదుల కోసం క్యూఆర్ కోడ్ సిస్టమ్‌ను ప్రారంభించిన ఏసీబీ

హైదరాబాద్, మహా : 2025 సంవత్సరంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) 199 కేసులు నమోదు చేసి, 273 మంది నిందితులను అరెస్టు చేసినట్లు ఇయర్ రౌండ్ అప్‌లో తెలిపింది. మొత్తం కేసుల్లో 157 ట్రాప్ కేసులు, వీటిలో 176 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగులపై ఆదాయానికి మించిన ఆస్తులకు సంబంధించిన 15 కేసులు, నేరపూరిత దుష్ప్రవర్తనకు సంబంధించిన 26 ఇతర కేసులు కూడా ఏసీబీ నమోదు చేసింది, వీటిలో 34 మంది నిందితులను అరెస్టు చేశారు. ఈ సంవత్సరంలో అవినీతి ఆరోపణలపై ఏసీబీ 26 సాధారణ విచారణలు నిర్వహించింది. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు, ఆర్టీఏ చెక్ పోస్టులు, సంక్షేమ హాస్టళ్లతో సహా వివిధ కార్యాలయాలలో 54 ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. ప్రభుత్వం నుండి ప్రాసిక్యూషన్ కోసం 115 అనుమతి ఉత్తర్వులను పొందింది. తదనుగుణంగా ఛార్జ్ షీట్లను దాఖలు చేసింది. 2025లో నమోదైన 157 ట్రాప్ కేసుల్లో ఏసీబీ మొత్తం రూ.57.17 లక్షలను స్వాధీనం చేసుకుంది. అందులో రూ.35.89 లక్షలు ఫిర్యాదుదారులకు తిరిగి చెల్లించారు. 15 ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో రూ.96.13 కోట్ల విలువైన ఆస్తులు బయటపడ్డాయి. నివారణ, సామర్థ్య నిర్మాణ చర్యలలో భాగంగా ఏసీబీ సిబ్బందికి శిక్షణ ఇవ్వడం పై ప్రత్యేక దృష్టి పెట్టారు. 73 మంది అధికారులకు ప్రాథమిక ఇండక్షన్ శిక్షణను అందించారు, అలాగే నిఘా పద్ధతులు, ఆర్థిక దర్యాప్తు, డిజిటల్ లావాదేవీల ట్రాకింగ్, బినామి ఆస్తుల చట్టం, ట్రాప్ అండ్ డీఏ కేసుల చట్టపరమైన అంశాలలో ప్రత్యేక శిక్షణను అందించారు. డిసెంబర్ నెల ప్రారంభంలో ఏసీబీ డైరెక్టర్ జనరల్ చారు సిన్హా ఆధ్వర్యంలో అవినీతి నిరోధక వారోత్సవాలు (డిసెంబర్ 3 నుంచి 9, 2025) నిర్వహించారు. పౌరులు, ముఖ్యంగా మారుమూల ప్రాంతాలలోని వారు, మధ్యవర్తులు లేకుండా త్వరగా, సురక్షితంగా ఫిర్యాదులను నమోదు చేసుకోవడానికి వీలుగా క్యూఆర్ కోడ్ ఆధారిత ఫిర్యాదు వ్యవస్థను ప్రారంభించారు. అవినీతికి వ్యతిరేకంగా పోరాటంలో ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు, వ్యాసరచన పోటీలు, బహుమతులను కూడా అందించింది. ప్రభుత్వ ఉద్యోగులు లంచం డిమాండ్ చేస్తే టోల్ ఫ్రీ నంబర్ 1064, వాట్సాప్ (9440446106) లేదా ఏసీబీ తెలంగాణ అధికారిక సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఫిర్యాదు చేయాలి. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని ఏసీబీ పేర్కొంది.

తెలంగాణ బార్ కౌన్సిల్ నామినేషన్ల ప్రక్రియ పూర్తి

200కు పైగా దరఖాస్తులు

హైదరాబాద్ సిటీ, మహా : తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ బుధవారంతో విజయవంతంగా పూర్తయ్యింది. 200 మందికి పైగా వివిధ పదవులకు దరఖాస్తులు చేశారు. ఇందులో యువ, సీనియర్ న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా, 30 శాతం మహిళా రిజర్వేషన్ కారణంగా మహిళా న్యాయవాదులు కూడా ఉత్సాహంగా నామినేషన్లు దాఖలు చేశారు. తెలంగాణ బార్ కౌన్సిల్‌కు సంబంధించిన న్యాయవాదులు జితేందర్ రెడ్డి , జే. లక్ష్మణ్ , పి. రవీందర్ తదితరులు నామినేషన్లు వేసిన వారిలో ఉన్నారు. న్యాయవృత్తిలో ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేసే విధంగా నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించబడిందని, బార్ కౌన్సిల్ ఎన్నికల ప్రక్రియలో నామినేషన్ల దశ పూర్తి కావడంతో తదుపరి ఎన్నికల ప్రక్రియ జరగనుంది.

పరకాల మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులుగా దుగ్యాల రాజేశ్వర్ రావు

పరకాల, మహా: హన్మకొండ జిల్లా పరకాల మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులుగా వెంకటాపూర్ గ్రామ సర్పంచ్ దుగ్యాల రాజేశ్వరరావు ను ఏకగ్రీవంగా అన్ని గ్రామాల సర్పంచ్ లు ఎన్నుకోవడం జరిగింది ఈ సందర్భంగా రాజేశ్వర్ రావు మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి మండల సర్పంచ్ ల ఫోరం బాధ్యతలను అప్పగించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. పేద ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తానని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను గ్రామాల అభివృద్ధికి వినియోగించేవిధంగా కృషి చేస్తానని తెలిపారు. సర్పంచ్‌లకు ఎటువంటి సమస్యలు వచ్చినా ముందుండి పోరాడతానని హామీ ఇచ్చారు. మండల సర్పంచ్‌ల ఫోరం బాధ్యతలను అప్పగించడంతో తనపై మరింత బాధ్యత పెరిగిందని అన్నారు సర్పంచుల హక్కులకై సర్పంచుల సమస్యలపై మీ ముందుండి మీ నాయకునిగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలియజేసుకుంటూ మీ అందరికీ ధన్యవాదములు తెలిపారు

ప్రజలు హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాసంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్!

పరకాల మహా: ప్రజలు రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన కలిగి యుండి చట్టాల పట్ల గౌరవంతో సోదరా భావాన్ని పెంపొందించుకోవాలని తహశీల్దార్ జగన్మోహన్ రెడ్డి, సిఐ సంతోష్, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి సూచించారు. మంగళవారం హన్మకొండ జిల్లా ఆత్మకూరు మండలంలోని కామారం గ్రామంలో సర్పంచ్ తోట వరలక్ష్మి కుమార్ అధ్యక్షతన పౌర హక్కుల దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన వారు మాట్లాడుతూ దళితుల పట్ల అంటరానితనాన్ని ప్రదర్శించడం నేరమని, దళితులు ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజా సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసులలో స్టేషన్ బెయిల్ ఇవ్వకుండా నేరస్తులకు శిక్ష పడేలా చూడాలని ఎస్సీ,ఎస్టీ నిధులు దారి మళ్లకుండా, దళితవాడలోనే అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు.

మూడు కార్పొరేషన్‌లుగా హైదరాబాద్

- **బల్దియా విభజన కసరత్తు పూర్తి**
- **మారిపోతున్న భాగ్యనగర చిత్రం**
- **జనవరి 2న రానున్న స్పష్టత**

హైదరాబాద్, మహా : హైదరాబాద్ మహానగర పాలనలో సరికొత్త అధ్యాయం మొదలు కాబోతోంది. పెరుగుతున్న జనాభా, విస్తరిస్తున్న నగరాన్ని దృష్టిలో ఉంచుకుని పౌర సేవలను మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను మూడు స్వతంత్ర కార్పొరేషన్లుగా విభజించేందుకు రంగం సిద్ధం చేసింది. ఔటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరించిన 2071 చదరపు కిలోమీటర్ల కోర్ అర్బన్ రీజియన్ ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి కోసం ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. జనవరి 2న జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో దీనిపై అధికారిక స్పష్టత రానుంది. ప్రభుత్వ నివేదిక ప్రకారం.. ప్రస్తుతం ఉన్న జీహెచ్ఎంసీ స్థానంలో హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి అనే మూడు కొత్త కార్పొరేషన్లు కొలువుదీరనున్నాయి. హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నగర గుండెకాయ వంటి ప్రాంతాలను కలిగి ఉండనుంది. సికింద్రాబాద్ రాంగోపాల్‌పేట నుంచి శంషాబాద్ వరకు విస్తరించి మొత్తం 150 డివిజన్లతో ఏర్పాటు కానుంది. పాతబస్తీ, సెంట్రల్ హైదరాబాద్‌లోని కీలక ప్రాంతాలన్నీ దీని పరిధిలోకి వస్తాయి. ఐటీ హబ్‌గా పేరుగాంచిన పశ్చిమ హైదరాబాద్ ప్రాంతమంతా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి వస్తుంది. నార్సింగి నుంచి శామీర్‌పేట జీనోమ్ వ్యాలీ వరకు 74 డివిజన్లతో ఇది ఏర్పాటు కానుంది. ఉత్తర, తూర్పు హైదరాబాద్‌ను కలుపుతూ కీసర నుంచి పెద్ద అంబర్‌పేట వరకు 76 డివిజన్లతో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పడనుంది. కొత్తగా ఏర్పడే సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్ల కోసం ప్రభుత్వం 10 ఎకరాల చొప్పున కేటాయించి అత్యాధునిక భవనాలను నిర్మించనుంది.

ఏ కార్పొరేషన్ పరిధిలోకి ఏ ప్రాంతాలు?

హైదరాబాద్ కార్పొరేషన్: చార్మినార్, ఫలక్‌నుమా, కోఠి, అబిడ్స్, నాంపల్లి, ఖైరతాబాద్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, రాజేంద్రనగర్, శంషాబాద్, బడంగ్‌పేట వంటి ప్రాంతాల్లోని డివిజన్లు ఈ కార్పొరేషన్ పరిధిలోకి రానున్నాయి సైబరాబాద్ కార్పొరేషన్: మియాపూర్, గచ్చిబౌలి, మాదాపూర్, హైటెక్ సిటీ, మణికొండ, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మేడ్చల్, జీనోమ్ వ్యాలీ ప్రాంతాల్లోని డివిజన్లు ఈ కార్పొరేషన్ పరిధిలోకి వస్తాయి. మల్కాజిగిరి కార్పొరేషన్: మల్కాజిగిరి, అల్వాల్, ఉప్పల్, నాగోల్, కాప్రా, ఈసీఐఎల్, ఘట్‌కేసర్, కీసర, ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ తదితర ప్రాంతాల్లోని డివిజన్లు ఈ కార్పొరేషన్ పరిధిలోకి వస్తాయి. ఫిబ్రవరి లేదా మార్చి నెలల్లో దీనికి సంబంధించిన తుది నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది. ఆ తర్వాత డివిజన్ల పేర్లపై కూడా స్పష్టత రానుంది.

కొత్త కమిషనర్ల నియామకం

కార్పొరేషన్ల ఏర్పాటుకు ముందే పాలనను పట్టాలెక్కించేందుకు ప్రభుత్వం ఐఏఎస్ అధికారులను అదనపు కమిషనర్లుగా నియమించింది. సైబరాబాద్ పరిధిలోని జోన్లకు జి.సృజనను, మల్కాజిగిరి పరిధిలోని జోన్లకు టి.వినయ్ కృష్ణారెడ్డిని నియమించారు. కార్పొరేషన్లు అధికారికంగా రూపుదాల్చాక వీరే కమిషనర్లుగా బాధ్యతలు చేపడతారు. హైదరాబాద్ కార్పొరేషన్ కమిషనర్‌గా ప్రస్తుత జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ కొనసాగుతారు. మరోవైపు.. 'ఫ్యూచర్ సిటీ' కమిషనరేట్ నిర్మాణం కోసం ప్రభుత్వం 30 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది.

ఐఏఎస్ ఆఫీసర్స్ క్లబ్‌లో న్యూ ఇయర్ సెలబ్రేషన్స్

పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మహా : సిటీలోని బేగంపేట్ ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ క్లబ్ లో 2026 నూతన సంవత్సర వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఆయనతో పాటు కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ రావు , పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం పలువురు అధికారులను అప్యాయంగా పలుకరించారు.

ఎవరి ప్రయోజనాల కోసం రోడ్డు నిర్మాణం?

- పేద ప్రజల ఇండ్ల ను కూల్చివేయడం వెనకాల నాయకుల ప్రయోజనాలు ఏంటి ?
- మా గూడు కోసం గోడు వినిపించడం లేదా?
- కోర్టు స్టే ఉన్న రోడ్డు నిర్మాణం ఎలా చేపడతారు
- రోడ్డు పనులు చేపడితే నాయకుల ఇండ్లు ముట్టడిస్తాం

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా: అధిబట్ల గ్రామంలో రోడ్డు నిర్మాణం చేపడితే పెద్ద ఎత్తున నాయకుల ఇండ్లను ముట్టడిస్తాం శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని రామచంద్రయ్య విగ్రహం నుండి ఔటర్ వరకు ఇండ్ల మధ్య నుంచి 120 ఫీట్ల రోడ్ వెడల్పు చేపట్టాలని ప్రభుత్వం గతంలో శిలాఫలకం వేయడం జరిగింది. దీని వ్యతిరేకిస్తున్న గ్రామస్తులు ఏ నాయకుల కోసం ఎవరికోసం ఎవరి స్వలాభం కోసం గ్రామం మధ్యలో 120 ఫీట్లు రోడ్ నిర్మాణం చేపడుతున్నారని ప్రశ్నించారు. రోడ్ కు ఇరు వైపులా గత కొన్ని సంవత్సరాలుగా ఉన్న ఇండ్ల పరిస్థితి ఏమిటి అని తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. రాజకీయ నాయకులు సొంత లాభం కోసం కమీషన్ల కోసం గ్రామస్తుల బాగోగులు పట్టించుకోకుండా తన ఇష్టం వచ్చినట్లు రోడ్ నిర్మాణంలో తలదుర్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులకు వారి భూములు, ప్లాట్స్ ధరలు పెరిగి రియల్ ఎస్టేట్ పెరుగుతుందని, రోడ్ వెడల్పు చేయాలని అధికారులకు వెనుక నుండి కాంట్రాక్టర్లకు వత్తాసు పలుకుతున్నారని పల్లె శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు. ఏది ఏమైనా మాకు కోర్ట్ స్టే ఉంది ఊరిలో నుండి రోడ్ తీసే ప్రసక్తే లేదని శ్రీనివాస్ గౌడ్ ఇండ్ల యజమానులకు అభయమిచ్చారు.. రోడ్డు నిర్మాణం పై కోర్ట్ స్టే ఉన్నందున రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇండ్లను కూల్చివేయాలని చూస్తే కబర్దార్ అని హెచ్చరించారు.

ఇబ్రహీంపట్నంలో యదేచ్ఛగా మట్టి తవ్వకాలు..

ప్రభుత్వ ఆదాయానికి గండి

చోద్యం చూస్తున్న మైనింగ్ జిల్లా అధికారులు..?

లక్షల్లో సంపాదిస్తున్న అక్రమార్కులు

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా: జిల్లాలో యదేచ్ఛగా మట్టి తవ్వకాలు జరుగుతున్న నిమ్మకు నీరెత్తనట్టుగా జిల్లా మైనింగ్ అధికారుల వ్యవహార తీరుపై పలువురు మండిపడుతున్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం, మంచాల మండలాల సరిహద్దు, సీతారాంపేట్, జనహర్షలో మట్టి మాఫియా అక్రమార్కులు యదేచ్ఛగా మట్టి తవ్వకాలు జరుపుతూ లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. ఏలాంటి మైనింగ్ అనుమతులు లేకుండా రాత్రి పగలు మట్టి తవ్వకాలు జరుపుతున్నా, అధికారులు స్పందించకపోవడం, అక్రమార్కులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. అసలు మైనింగ్ శాఖ ఉందా అనే ప్రశ్న ప్రజలలో ఉత్పన్నమవుతుంది. ఉంటే ఇంత జరుగుతున్న చర్యలు తీసుకోకపోవడంలా అంతర్యం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా మైనింగ్ అధికారి దృష్టిసారించి అక్రమాలపై అడ్డుకట్ట వేయాలని పలువురు తెలిపారు.

ఐబొమ్మ రవిది తెలివే తెలివి

పన్ను ఎగ్గొట్టేందుకు సోదరికి రూ. లక్షల్లో డబ్బు పంపిన రవి

పోర్జరీ ద్వారా రవి ఆర్జించింది. రూ. 13.40 కోట్లు
పోలీసులు రికవరీ చేసింది రూ. 3 కోట్లు
పోలీసు కస్టడీ రిపోర్టులో ఆసక్తికర అంశాలు

హైదరాబాద్, మహా : ఐబొమ్మ రవి పైరసీ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. పైరసీ సినిమాల ద్వారా రవి రూ. 13.40 కోట్లు ఆర్జించినట్లు తెలిసింది. ట్యాక్స్ ఎగ్గొట్టేందుకు అందులో రూ. 90 లక్షలు తన సోదరికి పంపినట్లు పోలీసులు గుర్తించారు. కాగా, కస్టడీలో విచారణకు ఐబొమ్మ రవి పూర్తిగా సహకరించలేదని తెలుస్తోంది. కొన్ని సందర్భాల్లో విచారణ అధికారులపైకే గుడ్లు ఉరిమి చూసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. తనపై ఉన్న కేసులన్నీ తప్పుడివేనని రవి వాదించాడు. తెలుగు రాష్ట్రాల్లో ఐబొమ్మ రవి కేసు సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఐబొమ్మ, బప్పం వంటి పైరసీ వెబ్‌సైట్లు సృష్టించిన కేసులో ప్రధాన నిందితుడు ఇమంది రవి కస్టడీ డిసెంబర్ 29తో ముగిసింది. అనంతరం అతడిని నాంపల్లి కోర్టులో హాజరు పరిచారు. ఈ సందర్భంగా రవి కస్టడీ రిపోర్టును పోలీసులు కోర్టుకు సమర్పించారు. అయితే ఆ నివేదికలో సంచలన విషయాలు బయటపడ్డాయి. 12 రోజుల కస్టడీలో రవి కేసులో కీలక అంశాలు బయటపెట్టారు పోలీసులు. సినిమాలను రెండు రకాలుగా కొనుగోలు చేసినట్లు ఐబొమ్మ రవి కస్టడీ రిపోర్టులో పోలీసులు పేర్కొన్నారు. రెండింటికీ వేరు వేరుగా ధర చెల్లించినట్లు సమాచారం. క్యామ్ కార్డర్ ప్రింట్‌కు ఒక ధర.. హెచ్‌డీ ప్రింట్‌కు మరో ధర చెల్లించినట్లు తెలిపారు. ఒక్కో క్యామ్ కార్డర్ ప్రింట్ సినిమాకు 100 డాలర్లు, హెచ్‌డీ ప్రింట్‌కు 200 డాలర్లు చెల్లించినట్లు తెలిపారు. కాగా, పైరసీ సినిమాల ద్వారా రవి బ్యాంకు ఖాతాలకు రూ. 13.40 కోట్లు వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. అయితే ఇందులో దాదాపు రూ. 3 కోట్లు మాత్రమే పోలీసులు ఫ్రీజ్ చేయగలిగారు.

సోదరికి డబ్బులు పంపిణీ

కాగా, రూ. 13.40 కోట్లలో బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ ద్వారా రవికి రూ. 1.58 కోట్లు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఈ డబ్బులో దాదాపు రూ. 90 లక్షలు తన సోదరి చంద్రికకు పంపించాడని చెప్పారు. అయితే నగదు లావాదేవీలన్నీ డాలర్ల రూపంలోనే జరిగినట్లు తెలుస్తోంది. అయితే సినిమాల పైరసీ ప్రారంభించిన మొదట్లో కొంతకాలం రవి కూకట్‌పల్లిలోనే ఉన్నాడని.. ఆ తర్వాత డబ్బులు ఎక్కువగా రావడంతో జల్సాల కోసం ఇతర దేశాలకు వెళ్లినట్లు పోలీసులు నిర్ధరించారు. కాగా, ఒక్కో కేసులో నాలుగు రోజుల చొప్పున.. మూడు కేసుల్లో 12 రోజులపాటు పోలీసులు ఐబొమ్మ రవిని కస్టడీలోకి తీసుకున్న విషయం తెలిసిందే.

ప్రశ్నలు అడిగితే ఉరిమి చూశాడు

కస్టడీలో విచారణకు రవి పూర్తిగా సహకరించలేదని తెలుస్తోంది. పోలీసుల ప్రశ్నలకు ఐబొమ్మ రవి నిర్భయంగా సమాధానం చెప్పినట్లు సమాచారం. అయితే.. అడిగిన ప్రశ్న మళ్లీ అడిగితే ఉరిమి చూసినట్లు సమాచారం. అయితే విచారణ తర్వాత రవి మీడియాతో మాట్లాడాడు. తన మీద పెట్టిన కేసులన్నీ తప్పుడువే అన్నాడు. ఏదైనా కోర్టులోనే తేల్చుకుంటానని చెప్పాడు. పైరసీ మాత్రమే కాకుండా రవిపై ఫోర్జింగ్ ఆరోపణలు కూడా వచ్చాయి. ఇటీవల ప్రహ్లాద్ పేరుపై రవి పాన్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్ తీసుకున్నాడు. అడిగితే అవి తన స్నేహితుడివి అని చెప్పాడు. దీంతో బెంగళూరుకు చెందిన ప్రహ్లాద్‌ను పిలిపించి.. అతడి ఎదుటే రవిని పోలీసులు ప్రశ్నలు అడిగారు. రవి తీసుకున్న పాన్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్సు విషయం తనకేమీ తెలియదని, తన అనుమతి కూడా తీసుకోలేదని ప్రసాద్ పోలీసులకు చెప్పాడు.

పండుగలప్పుడే డ్రగ్స్ కేసుల నమోదా?

అకున్ సబర్వాల్ ఆధ్వర్యంలో నాటి డ్రగ్స్ కేసు విచారణ ఏమైంది?

అసలు ఈగల్ టీం లీగల్ గా బాధ్యతలు నిర్వర్తిస్తోందా?
ఈగల్ టీంలో కొందరు డబ్బులకు అమ్ముడుపోయి డ్రగ్ పెడ్లర్లతో రాజీపడుతున్నారు
రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

హైదరాబాద్, మహా : "పండుగలు, నూతన సంవత్సరం వేడుకల సమయంలోనే డ్రగ్స్ కేసుల నమోదుకు పరిమితం అవుతున్నారే తప్ప రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ గా వ్యవహరించడం లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అకున్ సబర్వాల్ ఆధ్వర్యంలో జరిపిన 'డ్రగ్స్ కేసు' విచారణ నివేదికపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా నాటి డ్రగ్స్ కేసులో అనేక మంది బడా వ్యక్తుల పేర్లు, సినీ ప్రముఖులు ఉన్నారంటూ బండి సంజయ్ బాంబు పేల్చారు. డ్రగ్స్ కేసులో పట్టుబడిన వాళ్లను అకున్ సబర్వాల్ టీం నాడు విచారణ చేస్తే కేసీఆర్ కుటుంబ సభ్యులకు డ్రగ్స్ విక్రయదారులతో సంబంధాలున్నాయని తేలిందన్నారు. ఆ కుటుంబ సభ్యులు సైతం తమతో కలిసి డ్రగ్స్ తీసుకున్నారని డ్రగ్స్ కేసులో పట్టుబడి నిందితులు ఆనాడు అకున్ టీం ఎదుట వాంగ్మూలమిచ్చారని పేర్కొన్నారు. ఆ వాంగ్మూలంతో కూడిన ఆడియో, వీడియో రికార్డులు బయటకొస్తే తన కుటుంబ సభ్యుల రాజకీయ భవిష్యత్తు సమాధి అవుతుందని భయపడ్డ నాటి సీఎం కేసీఆర్ ఆకున్ సబర్వాల్ ను అర్ధాంతరంగా డ్రగ్స్ కేసు బాధ్యతల నుండి తప్పించారని తెలిపారు. అదే సమయంలో ఆ కేసుపై అకున్ సబర్వాల్ టీం రూపొందించిన నివేదికను, రికార్డు చేసిన ఆడియో, వీడియో, స్టేట్ మెంట్లన్నింటినీ నాటి సీఎస్ సోమేశ్ కుమార్ స్వాధీనం చేసుకున్నారని పేర్కొన్నారు. ఆ తరువాత డ్రగ్స్ కేసును పూర్తిగా నీరుగార్చారని మండిపడ్డారు. అకున్ సబర్వాల్ సేకరించిన ఆధారాలు, ఆడియో, వీడియో రికార్డులు, స్టేట్ మెంట్లను సోమేశ్ కుమార్ తదుపరి విచారణ టీంకు అప్పగించలేదని, వాటిని కోర్టుకు స్వాధీనం చేయలేదని తెలిపారు. ఈ మేరకు బండి సంజయ్ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజంగా డ్రగ్స్ నిర్మూలనపై చిత్తశుద్ధి ఉంటే సీఎం ఆధ్వర్యంలో పనిచేస్తున్న "ఈగల్" టీం వెంటనే రంగంలోకి దిగి సోమేశ్ కుమార్ ను విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈగల్ టీం విచారణ తీరుపైనా ఈ సందర్భంగా బండి సంజయ్ అనుమానం వ్యక్తం చేశారు. ఈగల్ టీంకు నిజంగా లీగల్ గా అధికారాలున్నాయా? అని ప్రశ్నించారు. ఈగల్ టీంలో సమర్థులైన అధికారులు ఉన్నప్పటికీ, ఒకరిద్దరు అధికారులు మాత్రం డబ్బులకు అమ్ముడుపోయి డ్రగ్ పెడ్లర్లతో రాజీపడుతున్నారని తెలిపారు. ఈగల్ టీం దాడిలో పెడ్లర్ల నుండి డ్రగ్స్ కొనుగోలు చేసిన ఇంతవరకు ఎందుకు అరెస్ట్ చేయలేదు? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా పెరుగుతున్న డ్రగ్స్ విక్రయాలపై ఉక్కుపాదం మోపాలంటే అకున్ సబర్వాల్ వంటి సమర్థులైన అధికారులకు తిరిగి 'డ్రగ్స్ కేసు' విచారణ బాధ్యతలను అప్పగించాలని డిమాండ్ చేశారు. అట్లా కాకుండా డ్రగ్స్ కేసు విచారణ తేల్చకుండా తూతూ మంత్రంగా కేసులు నమోదు చేసినంత మాత్రాన రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలన సాధ్యం కానేకాదని స్పష్టం చేశారు.

ఇదే స్ఫూర్తితో ప్రజా సమస్యలపై

పోరాడాలి

జేఏసీ నాయకులను సత్కరించిన సబితా ఇంద్రారెడ్డి

రాజేంద్రనగర్, మహా : శంషాబాద్ జిహెచ్ఎంసి ప్రత్యేక జోన్ కావాలని పోరాటం చేసిన శంషాబాద్ జేఏసీ నాయకులను ప్రత్యేక జోన్ ఏర్పాటైన సందర్భంగా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, కార్తీక్ రెడ్డి శాలువలతో సత్కరించి పోరాటపటిమను మెచ్చుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ జేఏసీ నాయకులను పోరాట పటిమను అంకిత భావాన్ని మెచ్చుకున్నారు, ఇదే స్ఫూర్తిని ప్రాజా సమస్యల పోరాటాలలో కూడా కొనసాగించాలన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా జేఏసీ నాయకులు పార్టీలకు అతీతంగా కలసి కట్టుగా పని చెయ్యాలన్నారు. కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ జేఏసీ నాయకుల పట్టుదలను గుర్తు చేస్తూ ఇలాంటి పోరాటాలకు బిఆరెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. ప్రజలకోసం పని చేసే ఏకైక ఎజెండా తో ముందుకు వెళ్లాలని జేఏసీ నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులుకోన్నమొల్ల శ్రీనివాస్, బుచ్చిరెడ్డి, మోహన్ రావు, జయసింహ, రమేష్, వర్ధన్, అర్జున్, మనీష్, విట్టలయ్య గౌడ్, నర్రాగిరి, అన్నే ప్రభువు ముదిరాజ్, శేఖర్, సాగర్, అశోక్, పరమేశ్వరి, యాదగిరి, సాయి, ఫాతిమా తదితరులు నాయకులు పాల్గొన్నారు.

అధికారికంగా సర్వే నిర్వహించి

సమస్యను పరిష్కరిస్తాం

ఎమ్మార్వో రవీందర్ దత్

రాజేంద్రనగర్ మహా ; హైడ్రాధికారి దౌర్జన్యాల శీర్షికకు స్పందించిన ఎమ్మార్వో రవీందర్ దత్ శంషాబాద్ మండలం చౌదర్ గూడా రెవెన్యూ పరిధిలోని 146 సర్వే నెంబర్లో గల భూమిలో నడుస్తున్న రెవెన్యూ సమస్యను ఇరువురి సమక్షంలో ఏడి సర్వే నిర్వహించి హద్దురాలు నిర్ణయిస్తామన్నారు. సమస్యను సామరస్యంగా పరిష్కరించే ప్రయత్నం చేస్తామని ఎమ్మార్వో రవీందర్ ద తెలిపారు.

యువత క్రీడలపై శ్రద్ద పెట్టాలి

మొయినాబాద్ మహా: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడలపై శ్రద్ద పెట్టాలని అజీజ్ నగర్ యువ నాయకుడు బండ్లగూడం శ్రీదర్ పేర్కొన్నారు. మొయినాబాద్ మ న్సిపల్ పరిధిలోని అజీజ్ నగర్ గ్రామంలో జరుగుతున్న అజీజ్ నగర్ ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) క్రికెట్ టోర్నీలో ఆయన పాల్గొని పోటీలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో ఇలాంటి క్రీడల పోటీలను నిర్వహించడం ద్వారా యువతలో చైతన్యం వస్తుందని అన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడాలపట్ల శ్రద్ధ పెట్టాలని సూచించారు. క్రీడాలు ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు మాణిక్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టు అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి

కరీంనగర్ మహా : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొండగట్టు ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని కరీంనగర్ డిసిసి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. పక్క ప్రణాళిక మాస్టర్ ప్రకారం అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జనవరి 3 వ తేదీన కొండగట్టు పర్యటన పురస్కరించుకొని బుధవారం జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తో కలిసి ఎమ్మెల్యే ఏర్పాట్లను పరిశీలించారు. ఏర్పాట్లు పక్కాగా, పకడ్బందీగా చేపట్టాలని ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు రాకుండా చూడాలని సూచించారు. ప్రత్యేక రూట్ మ్యాప్ ద్వారా ప్రత్యేక పూజలు అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమాలు పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మీడియాతో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నీ కలిసి కొండగట్టు అంజన్న మీ ఆరాధ్య దైవమని ఈ దేవాలయానికి మీరు కొంత సహాయం చేయాలని కోరడంతో పాటు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి నారా లోకేష్ కు ప్రత్యేకంగా లేఖలు రాశానని తెలిపారు. దీంతోపాటు దానికి అనుగుణంగా ప్రయత్నాలు చేయడం ద్వారా కొంత ఆలస్యమైనప్పటికీ పవన్ కళ్యాణ్ స్పందించి దాదాపు 36 కోట్ల రూపాయలు కొండగట్టు ఆలయానికి మంజూరు చేయించారని తెలిపారు 100 గదుల వసతి గృహంతో పాటు మాల విరమణ మండపం

కట్టిస్తామని హామీ ఇచ్చారని పనులు ప్రారంభించేందుకు ఈ నెల మూడో తేదీన పవన్ కళ్యాణ్ తెలిపారు. చొప్పదండి నియోజకవర్గం ప్రజల పక్షాన పవన్ కళ్యాణ్, ఆ రాష్ట్ర ప్రభుత్వానికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. జనవరి 3వ తేదీన పవన్ కళ్యాణ్ తో కలిసి 100 గదుల నిర్మాణం కోసం శంకుస్థాపన చేస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొండగట్టు అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని, పూర్తిస్థాయి ప్రణాళిక తీసుకురావాలని ఆదేశించారని పేర్కొన్నారు. త్వరలోనే పక్కా ప్రణాళిక, మాస్టర్ ప్లాన్ తో ముఖ్యమంత్రిని కలుస్తామని, కొండగట్టు అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం పక్షాన అన్ని కార్యక్రమాలన చేపడతామని చెప్పారు. కొండగట్టు అభివృద్ధికి మేము ఏమో చేశామని మాట్లాడే బిఆర్ఎస్ నేతలు, ప్రజలకు ఏం చేశారో, నిరుద్యోగులకు ఏం చేశారో, రైతులకు ఏమి చేశారో ఆత్మ విమర్శ చేసుకోవాలనీ ప్రశ్నించారు. జగిత్యాల డిఎస్పి రఘుచందర్ తో పాటు అధికారులు పాల్గొన్నారు.

ఆరుట్లలోని తెలంగాణ

అరకుపై పోలీసుల దాడి

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా: మంచాల పోలీస్ స్టేషన్ పరిధిలోని తెలంగాణ అరకులో అనుమతులు లేకుండా 31 సెలబ్రేషన్ చేస్తున్నాడంతో పోలీసులు దాడి చేశారు. రాష్ట్ర డిజిపి ఆదేశాలను బేఖాతలరు చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా 31 సెలబ్రేషన్ చేసుకోవడం జరుగుతుంది. రంగారెడ్డి జిల్లా మంచాల పోలీస్ స్టేషన్ పరిధి, ఆరుట్ల రెవెన్యూ పరిధిలోని తెలంగాణ అరకు రిసార్టులో ఎలాంటి అనుమతులు లేకుండా 31 సెలబ్రేషన్ నిర్వహిస్తుండగా, పోలీసులు రంగ ప్రవేశం చేసి సెలబ్రేషన్ భగ్నం చేశారు. అనుమతులు లేకుండా ప్రోగ్రాం నిర్వహించడంపై సీఐ మధు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా కార్యక్రమం ఎలా నిర్వహిస్తారని ఆర్గనైజర్స్ ను అదుపులోకి తీసుకున్నారు. సౌండ్ సెట్ ను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ యొక్క 31 సెలబ్రేషన్ కార్యక్రమంలో దాదాపు 50 నుంచి ఉన్న మంది పాల్గొన్నట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ప్రోగ్రాం నిర్వహించిన నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిఐ మధు వెల్లడించారు. ఆగపల్లి గ్రామంలోని లా సెరెనా రిసార్టులో ఎలాంటి అనుమతులు లేకుండా ప్రోగ్రాంను నిలిపివేసిన మంచాల పోలీసులు.

560 ఎకరాల ప్రభుత్వ భూమిలో

నిర్మాణాలు కనిపించవా..?

రెవెన్యూ అధికారులను ఘెరావ్ చేసిన గిరిజనులు
శంషాబాద్ మండలం మదనపల్లి కొత్తతండా గిరిజనుల నిరసన

రాజేంద్రనగర్, మహా : శంషాబాద్ మండలంలో కూల్చివేతలపై రచ్చ జరుగుతోంది. పరస్పర ఫిర్యాదులతోనే కూల్చివేతలు జరుగుతున్నాయని గిరిజనులు ఆరోపించారు. సర్వే నంబర్ 50 లో కేవలం 10 ఎకరాల నిర్మాణాలను మాత్రమే కూల్చివేశారని శంషాబాద్ మండలం మదనపల్లి కొత్త తండా గిరిజనులు బుధవారం రెవెన్యూ అధికారులను ఘెరావ్ చేశారు. మదనపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 50 లో సుమారు 560 ఎకరాల్లో 70% పైగా నిర్మాణాలు చుట్టుముట్టు ప్రీ కాస్ట్ వేసి రూమ్ లను నిర్మించారు. వాటిని వదిలేసి రెవెన్యూ అధికారులు ఫిర్యాదులు వచ్చాయన్న నెపంతో కేవలం 10 ఎకరాలపైనే ఇప్పటికి ఐదు సార్లు కూల్చివేతలు చేపట్టారని రెవెన్యూ అధికారులకు కాసేపు అడ్డు తగులుతూ ఆందోళన చేపట్టారు. పోలీసుల సహాయంతో మదనపల్లి సర్వే నెంబర్ 50 లో 10 ఎకరాలో ప్రీ కాస్ట్ నిర్మాణాలను జెసిబి సహాయంతో తొలగించారు. మొత్తం 560 ఎకరాల్లో నిర్మాణాలను వదిలిపెట్టి గిరిజనులు వేసుకున్న నిర్మాణాలు మాత్రమే కూల్చి వేస్తున్నారని గిరిజనులు ఆందోళన నిర్వహించారు. పోలీసులు కలగజేసుకుని రెవెన్యూ అధికారులను అక్కడి నుంచి పంపించి వేశారు. ప్రభుత్వ భూమిని కాపాడాలన్న ఉద్దేశం అధికారులకు ఉంటే 560 ఎకరాల్లో నిర్మాణాలకు కూల్చివేసి ప్రభుత్వ బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానిక గిరిజనులు డిమాండ్ చేశారు.

ఘనంగా ఎస్ఎఫ్ఐ 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

జెండా ఆవిష్కరించిన రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్

మొయినాబాద్ మహా: విద్యార్థి పోరాటాల వేగుచుక్కగా నిలిచిన భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మొయినాబాద్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావాన్ని స్మరిస్తూ.. విప్లవ వీరుడు భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జెండాను రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత విద్యార్థి ఫెడరేషన్ 1970 సంవత్సరంలో కేరళ రాష్ట్రం త్రివేంద్రంలో స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాలతో 'అధ్యయనం పోరాటం' నినాదంతో ప్రారంభమైందన్నారు. నేడు దేశవ్యాప్తంగా 30 లక్షల సభ్యత్వంతో అతి పెద్ద విద్యార్థి సంఘంగా ఎదిగిందన్నారు. దేశంలో చదువుతున్న ప్రతి విద్యార్థికీ నాణ్యమైన, శాస్త్రీయమైన, ఉచిత విద్య అందాలనే లక్ష్యంతో ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటం చేస్తోందని తెలిపారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మతోన్మాద బీజేపీ ప్రభుత్వం విద్యార్థులకు వ్యతిరేకంగా నూతన విద్యా విధానాన్ని అమలు చేస్తూ అశాస్త్రీయమైన, చరిత్రను వక్రీకరించే విద్యను ప్రవేశపెడుతోందని, తీవ్రంగా విమర్శించారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేండ్లు గడిచినా విద్యాశాఖకు మంత్రి నియమించకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. తక్షణమే రాష్ట్రానికి పూర్తిస్థాయి విద్యాశాఖ మంత్రిని నియమించి, పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ల, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని, సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు ఎర్రవల్లి శ్రీనివాస్ , ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల అధ్యక్ష, కార్యదర్శులు , రేశ్వంత్,చరణ్ గౌడ్, ఉపాధ్యక్షులు ,ఎండి. ఇర్ఫాన్, చేవెళ్ల మండల అధ్యక్ష కార్యదర్శులు, ఇర్ఫాన్, మాల చందు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రజలకు నూతన

సంవత్సర శుభాకాంక్షలు

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

రంగారెడ్డి జిల్లా ప్రధానమంత్రి మహా: ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన నియోజకవర్గ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి. నూతన సంవత్సర సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు, నేతలకు, ప్రజా ప్రతినిధులకు, కార్యకర్తలకు మాజీ ప్రజాప్రతినిధులకు, నూతనంగా కాంగ్రెస్ పార్టీ తరపున ఎన్నికైన సర్పంచులకు, ఉప సర్పంచులకు వార్డ్ మెంబర్లకు, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొత్త సంవత్సరంలో ప్రతి ఒక్కరికి మంచి చేకూరాలని, ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన తెలిపారు.

ముగిసిన పత్రీజీ ధ్యాన మహాయాగం..

కడ్తాల్ మహేశ్వర మహా పిరమిడ్ విజయవంతం

ఆమనగల్లు, మహా: రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం కైలాసపురిలోని మహేశ్వర మహాపిరమిడ్ లో నిర్వహించిన పత్రీజీ ధ్యాన మహాయాగం ఘనంగా ముగిసింది. డిసెంబర్ 21 నుంచి 31 వరకు అంగరంగ వైభవంగా జరిగిన పత్రీజీ ధ్యాన మహాయాగం ముగింపు సంబరాల్లో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూమెంట్ సహవ్యవస్థాపకురాలు స్వర్ణమాల పత్రీ, ది పిరమిడ్ స్పిరుచ్యువల్ ట్రస్ట్ హైదరాబాద్ చైర్మన్ విజయభాస్కర రెడ్డి, బ్రహ్మర్షి పత్రీజీ కూతరు పరిణిత పత్రీ, ట్రస్ట్ సభ్యులు, సీనియర్ పిరమిడ్ మాస్టర్లు పాల్గొని జ్ఞాన సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా స్వర్ణమాల పత్రీ అమ్మ మాట్లాడుతూ ట్రస్ట్ సభ్యులు ఎంతో కృషి చేసి ధ్యాన మహాయాగం అత్యంత అద్భుతంగా నిర్వహించారని కొనియాడారు. ఇంత పెద్ద కార్యక్రమాన్ని చేయడం అంత సులువు కాదని, ఎంతో నిబద్ధతతో, ఎంతో కృషి చేయడం వల్లనే ఇంత గొప్పగా విజయవంతం అయ్యిందని ప్రశంసించారు. అనంతరం ది పిరమిడ్ స్పిరుచ్యువల్ ట్రస్ట్ హైదరాబాద్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ పత్రీజీ ధ్యానమహాయాగం అత్యంత అద్భుతంగా, ఎంతో ప్రశాంతంగా జరిగిందన్నారు. బ్రహ్మర్షి పత్రీజీ చైతన్యంతోనే ఇది సాధ్యమైందన్నారు. 2026 లో కొత్త ప్రణాళిక రూపొందించి ముందుకు సాగుతామని చెప్పారు. 2026 సంవత్సరాన్ని పత్రీజీ మౌన ధ్యాన మహాయాగంగా నామకరణ చేస్తున్నట్లు చెప్పారు. ట్రస్ట్ సభ్యులు సేత్ బాలకృష్ణ మాట్లాడుతూ ఇంత ప్రశాంతంగా పత్రీజీ ధ్యాన మహాయాగం జరగడం ఒక అద్భుతమన్నారు. మిగతా యాగాలకు కూడా అందరూ ఇదేవిధంగా సహకరించాలని కోరారు. బ్రహ్మణరత్న మారం శివప్రసాద్ మాట్లాడుతూ పీఎస్ఎస్ఎం ఇంతింతై వటుండితై అన్నట్లుగా ఎదిగి ప్రపంచవ్యాప్తంగా విస్తరించిందని తెలిపారు, ఈ ఏడాది పత్రీజీ ధ్యాన మహాయాగం ఎంతో సులువుగా, ప్రశాంతంగా అద్భుతంగా జరిగిందన్నారు. అనంతరం మాట్లాడిన ఇతర ట్రస్ట్ సభ్యులు పత్రీజీ ధ్యాన మహాయాగం ఇంత అద్భుతంగా విజయవంతం కావడానికి ప్రతి పిరమిడ్ మాస్టర్ ఎంతో సహాయసహకారాలు అందించారని వారందరికీ ధన్యవాదాలు తెలియజేసారు. ఆతర్వాత స్వర్ణమాల పత్రీ అమ్మ కేక్ కట్ చేసి ముగింపు వేడుకల సంబరాలు జరుపుకొని కార్యక్రమాన్ని ఘనంగా ముగించారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన, సృజనాత్మకత,పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించాలి

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

హుజూర్ నగర్ మహా: విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన, సృజనాత్మకత అలాగే పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించేందుకు సైన్స్ ఫెయిర్ ప్రదర్శన ఉపయోగపడుతుందని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. హుజూర్ నగర్ పట్టణంలోని వి వి ఎం పాఠశాలలో ఏర్పాటు చేసిన 53 వ జిల్లా స్థాయి విద్యా, బాల వైజ్ఞానిక ప్రదర్శన2025 ముగింపు కార్యక్రమమునకు జిల్లా కలెక్టర్ బుధవారం ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూతక్కువ వయస్సు లోనే విద్యార్థులు సుస్థిర వ్యవసాయం, వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ కు ప్రత్యామ్నాయం,గ్రీన్ ఎనర్జీ, ఎమర్జింగ్ టెక్నాలజీ, వినోదాత్మక గణిత నమూనా నిర్మాణం, ఆరోగ్యం పరిశుభ్రత, నీటి సంరక్షణ నిర్వహణ లలో సమస్యలు గుర్తించి నూతన ఆలోచనలతో వినూత్న పద్ధతిలో సమస్యలను పరిష్కరించటం అభినందనీయమని తెలిపారు.గ్రామీణ ప్రాంతానికి చెందిన ఈ చిన్నారులు ఇప్పుడే మదర్ బోర్డ్,సెన్సార్, కోతుల బెడద కొరకు పరికరాలు లను ఉపయోగించి సమస్యల పరిష్కరిస్తున్నారంటే రాబోయే 10 ఏళ్ల తర్వాత వారి నూతన ఆలోచనలతో రోబోటిక్స్ ను తయారు చేసే విధంగా ఉపాధ్యాయులు వారికి సైన్స్ అండ్ టెక్నాలజీ పై అవగాహన కల్పించాలని సూచించారు.బుధవారంతో 2025 సంవత్సరం ముగుస్తుందని 2026 నూతన సంవత్సరం విద్యార్థులకి ఉజ్వల భవిష్యత్ ఉండాలని కోరుకుంటూ అందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు జూనియర్ విభాగం లో 121,సీనియర్ విభాగం లో 133 మంది, ఇన్స్పెయిర్ 64 మంది విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను కలెక్టర్ వీక్షించారు.ఈలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో టెక్నాలజీ పై ఆసక్తి పెరిగి, సమస్య పరిష్కార నైపుణ్యాలు మెరుగుపడతాయని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు బహుమతులు ప్రశంసాపత్రాలు అందజేశారు.

మున్సిపల్ కమిషనర్ ఇది న్యాయమేనా

మున్సిపాలిటీ స్పందించాలని కోరుతున్న ఏఈ వినోద్

షాద్ నగర్, మహా: తమా కార్యాలయాన్ని సర్వాంగ సుందరంగా ఉంచుకున్న మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది ఇతర కార్యాలయాల ఇబ్బందిని మాత్రం పట్టించుకోవడం లేదు. దీనితో ఎక్కడెక్కడ నుంచో కాలువలా వస్తున్న మురుగు నేరుగా వచ్చి షాద్ నగర్ పరిగి రోడ్డులో గల విద్యుత్ శాఖ కార్యాలయంలోకి చేరుతుంది. ఇక్కడ అడుగుపెట్టిన దుర్గంధమయమైన పరిస్థితులు ఉండడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా, మరోవైపు దుర్గంధాన్ని భరించలేక సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు. కార్యాలయంలోకి అడుగుపెట్టి చీదరింపు కొడుతున్న వినియోగదారులు మున్సిపల్ కమిషనర్ గారు ఇది న్యాయమేనా అంటూ నిలదీస్తున్నారు. సమీపంలో కాలువల వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో పైకాల నీల నుంచి మురుగు వరదలా వచ్చి ఈ కార్యాలయంలోకి చేరుతుంది. దీనితో కార్యాలయం అంతా దుర్గంధమయంగా మారుతుంది. కాలువల వ్యవస్థ పై మున్సిపాలిటీ శ్రద్ధ చూపక పోవడం వల్లనే ఇలాంటి పరిస్థితి ఎదురవుతుందని విద్యుత్ శాఖ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా మున్సిపాలిటీ అధికారులు స్పందించి ఈ సమస్య నుంచి విముక్తి కల్పించాలని కోరుతున్నారు. ఈ వ్యవహారం పై పట్టణ ఏఈ వినోద్ మీడియాతో మాట్లాడుతూ దుర్గంధం ఏమైనా ఈ ప్రాంతంలో కనీసం ఉద్యోగం చేసుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పలు సందర్భాల్లో మున్సిపల్ కమిషనర్ అదే విధంగా ఇతర కార్యాలయ సిబ్బందికి ఎన్నిసార్లు తమ ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని తమ సమస్య పరిష్కారం కావడంలేదని దీంతో ఇప్పుడు కార్యాలయం మొత్తం దుర్గంధమయమై ఎక్కడ నీరు అక్కడ నిలిచిపోయిందని ఆయన ఎవరు పట్టించుకోవడంలేదని ఆవేదన చెందారు. తాము మున్సిపాలిటీకి సంబంధించిన అనేక విద్యుత్ కు సంబంధించిన పనులు చేస్తున్నామని ఎంత సహకరిస్తున్నామని కానీ తమకు మాత్రం ఏ మాత్రం వారు సహకరించడం లేదని ఏ ఈ వినోద్ ఆందోళన వ్యక్తం చేశారు.

ఆర్యవైశ్యులందరూ రాజకీయంగా ఎదగాలి

ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా: ఆర్యవైశ్య సోదరులు వ్యాపార రంగంతో పాటు రాజకీయంగా ఎదగాలని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ మందమల్లమ్మ చౌరస్తాలోని లక్ష్మి కన్వెన్షన్ లో బుధవారం తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఆత్మీయ సమావేశం మరియు 2026 నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు అన్నివిధాలా కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అండగా నిలుస్తుందని అన్నారు. గతంలో తాను మలక్ పేట ఎమ్మెల్యేగా పనిచేసినప్పుడు ఆర్ కే పురంలో అష్టలక్ష్మి దేవాలయంకు సంపూర్ణ సహకారం అందించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆర్యవైశ్యులు పేదలకు అన్నదానంతో పాటు ధాన ధర్మాలు మంచి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారని ఆయన కొనియాడారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికలలో పోటీ చేసే ఆర్యవైశ్యులకు టికెట్ల కేటాయింపులో తనవంతు సహకారం అందిస్తానని ఆయన అన్నారు. అమరవాది లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆర్యవైశ్య సోదరులు మున్సిపల్ ,జిహెచ్ఎంసి ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలలో పోటీచేసి విజయం సాధించాలని ఆయన అన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే ఆర్యవైశ్యులకు ఆర్యవైశ్య మహాసభ అండగా ఉంటుందని అన్నారు. పార్టీలకు అతీతంగా ఏ పార్టీ నుండి పోటీ చేసిన వారికి ఆర్యవైశ్య మహాసభ అండగా ఉంటుందన్నారు టికెట్ కోసం ప్రయత్నించేవారు సమాచారమిస్తే తాను వారికి సహకరిస్తానని ఏ పార్టీ నుండైనా వారికి టికెట్లు ఇప్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు.



EDITORIAL సంపాదకీయం

ప్రజల ఆరోగ్యానికి ప్రజాపాలన హామీ

తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చొరవతో రాష్ట్ర వైద్య రంగంలో గణనీయమైన మార్పు చోటుచేసుకుంటోంది. ఒకప్పుడు ప్రభుత్వ ఆసుపత్రి అంటేనే సామాన్య ప్రజల మనసుల్లో అనుమానం, నిర్లక్ష్యం, భయం అనే భావనలు బలంగా ఉండేవి. కార్పొరేట్ ఆసుపత్రుల హడావుడి మధ్య సర్కార్ వైద్యం వెనుకబడి ఉందన్న అభిప్రాయం సమాజంలో విస్తృతంగా ప్రచారంలోకి వచ్చింది. అయితే కాలం మారింది, పరిస్థితులు మారుతున్నాయి. నేడు ప్రభుత్వ ఆసుపత్రుల వైద్య సేవలు నాణ్యతలోనూ, నైపుణ్యంలోనూ కొత్త ప్రమాణాలను నెలకొల్పుతున్నాయి. ఆధునిక పరికరాలు, నిపుణులైన వైద్యులు, మెరుగైన మౌలిక సదుపాయాలతో సర్కార్ వైద్యం ప్రజల విశ్వాసాన్ని తిరిగి సంపాదించుకుంటోంది. ఈ మార్పుకు ప్రతీకగా నిలుస్తున్నది రాష్ట్రంలోని అత్యున్నత స్థాయి ఐఏఎస్ అధికారులు స్వయంగా ప్రభుత్వ ఆసుపత్రులనే ఎంచుకోవడం. లక్షల రూపాయలు ఖర్చు చేసి కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందగలిగే సామర్థ్యం ఉన్నప్పటికీ, ప్రభుత్వ వైద్యుల నైపుణ్యం, సేవాభావంపై నమ్మకంతో సర్కార్ ఆసుపత్రుల వైపు అడుగులు వేయడం తెలంగాణ వైద్య వ్యవస్థలో చోటుచేసుకున్న సానుకూల పరిణామానికి స్పష్టమైన సంకేతంగా నిలుస్తోంది.

లక్షల రూపాయలు ఖర్చు చేసి కార్పొరేట్ ఆసుపత్రుల్లో అత్యాధునిక వైద్యం పొందగలిగే ఆర్థిక సామర్థ్యం ఉన్నప్పటికీ, ప్రభుత్వ వైద్యుల నైపుణ్యం, సేవాభావంపై విశ్వాసంతో ఐఏఎస్ అధికారులు తమ కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే చికిత్స చేయించడం సామాన్య ప్రజల్లో కొత్త ఆత్మవిశ్వాసాన్ని నింపుతోంది. ఇది కేవలం వ్యక్తిగత నిర్ణయం మాత్రమే కాదు సర్కార్ వైద్యంపై ఒక బలమైన నమ్మకానికి ప్రతీకగా మారింది.

ఇటీవల సికింద్రాబాద్ గాంధీ ప్రభుత్వ ఆసుపత్రిలో చోటుచేసుకున్న సంఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. హౌసింగ్ బోర్డు సెక్రటరీ, ఐఏఎస్ అధికారి వీపీ గౌతమ్ తన సతీమణి ప్రసవం కోసం గాంధీ ఆసుపత్రినే ఎంచుకున్నారు. సోమవారం ఆమెకు పురిటి నొప్పులు రావడంతో ఆసుపత్రిలో చేర్పించగా, గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ శోభ నేతృత్వంలోని వైద్య బృందం శస్త్రచికిత్స నిర్వహించింది. తల్లి, బిడ్డ ఇద్దరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని, ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో కోలుకుంటున్నారని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. ఈ ఒక్క ఘటన ప్రభుత్వ వైద్య సేవల స్థాయిని చెప్పడానికి చాలు అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇది ఒక్క ఉదాహరణ మాత్రమే కాదు. గత కొంతకాలంగా పలువురు జిల్లా కలెక్టర్లు కూడా తమ వ్యక్తిగత జీవితాల్లో ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకాన్ని చేతల్లో చూపిస్తున్నారు. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తన సతీమణి ప్రసవాన్ని గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో విజయవంతంగా చేయించారు. అదే విధంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సైతం సతీమణి కాన్పు కోసం ప్రభుత్వ ఆసుపత్రినే ఎంచుకున్నారు. ఈ నిర్ణయాలు అక్కడి వైద్యులు, సిబ్బందికి మరింత బాధ్యతాభావాన్ని కలిగించడమే కాకుండా, ప్రజల్లో ప్రభుత్వ ఆసుపత్రులపై విశ్వాసాన్ని పెంచాయి.

మరోవైపు, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి స్వయంగా కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఈఎన్‌టీ విభాగంలో నాజల్ సర్జరీ చేయించుకొని వ్యవస్థపై తన నమ్మకాన్ని చాటారు. "ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉంది" అన్న సందేశాన్ని ఆమె చర్య మాటల్లో కాకుండా చేతల్లో చూపించింది. ఈ సంఘటనలు అధికార వర్గాల్లోనే కాదు, సామాన్య ప్రజల్లోనూ విస్తృత చర్చకు దారితీశాయి.

ఐఏఎస్ అధికారులు మాత్రమే కాకుండా, ఇటీవల న్యాయమూర్తులు, ఉన్నతాధికారులు కూడా నిమ్స్, గాంధీ, ఉస్మానియా వంటి ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న ఉదంతాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇది యాదృచ్ఛికం కాదు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య-ఆరోగ్య రంగంపై పెడుతున్న దృష్టి, మౌలిక వసతుల అభివృద్ధి, ఆధునిక పరికరాల సమకూర్చడం, నిపుణ వైద్యుల నియామకం వంటి చర్యలు ప్రభుత్వ ఆసుపత్రుల రూపురేఖలను పూర్తిగా మార్చేశాయి. ఫలితంగా సర్కార్ వైద్యం కార్పొరేట్ స్థాయికి చేరువవుతోందన్న అభిప్రాయం ప్రజల్లో బలపడుతోంది.

- డా. ఎం. రాజీవ్,
ఎంబీబీఎస్ ఎండీ పల్మనాలజీ రాష్ట్ర చైర్మన్
(టీపీసీసీ - డాక్టర్స్ సెల్, మెడికల్ & హెల్త్ వింగ్)

ఈ మార్పుల ప్రభావం ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజలపై స్పష్టంగా కనిపిస్తోంది. "అత్యున్నత హోదాలో ఉన్నవారే ప్రభుత్వ ఆసుపత్రులను నమ్ముతున్నారంటే, అక్కడి వైద్యం నాణ్యతపై సందేహం ఎందుకు?" అన్న భావన సామాన్యుల మనసుల్లో బలపడుతోంది. ఒకప్పుడు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలంటే భయపడిన పేదోడు, ఇప్పుడు ధైర్యంగా అడుగు పెడుతున్న పరిస్థితి ఏర్పడుతోంది. ఇది ప్రభుత్వ వైద్య వ్యవస్థకు లభిస్తున్న నైతిక విజయంగా చెప్పవచ్చు.

మాటల్లో కాదు – చేతల్లో చూపిస్తూ ఐఏఎస్ అధికారులు తెలంగాణ ప్రభుత్వ వైద్యానికి నిజమైన బ్రాండ్ అంబాసిడర్లుగా నిలుస్తున్నారు. వారి నిర్ణయాలు ప్రకటనలకన్నా, ప్రచారాలకన్నా ఎక్కువ ప్రభావాన్ని చూపిస్తున్నాయి. ఇది రాష్ట్ర వైద్య వ్యవస్థకు గర్వకారణమే కాకుండా, ప్రజలకు ఒక పెద్ద భరోసా. ప్రభుత్వ ఆసుపత్రులపై పెరుగుతున్న ఈ విశ్వాసమే రాబోయే రోజుల్లో సర్కార్ వైద్యాన్ని మరింత బలోపేతం చేసే శక్తిగా మారనుంది.

రచనలకు ఆహ్వానం
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp:
74369 39999

చలికి ఇంతేలే అనుకోవద్దు

చలికాలంలో ఎన్నో ఆరోగ్య సమస్యలు వస్తాయి. అయితే, చలికాలంలో గుండెపోటు కేసులు ఎక్కువగా నమోదవుతాయని నిపుణులు అంటున్నారు. శీతాకాలంలో ముఖ్యంగా ఉదయం పూట గుండెపోటు రేట్లు 2030% పెరుగుతాయని గణాంకాలు చెబుతున్నాయి. ఇందుకు అనేక కారణాలు ఉన్నాయి. అయితే, చాలా మంది శీతాకాలంలో కనిపించే కొన్ని లక్షణాల్ని గ్యాస్ ట్రబుల్ లేదా చలికి అనుకోని నిర్లక్ష్యం చేస్తారు. కానీ, అవి గుండెపోటు లక్షణాలు అంటున్నారు డాక్టర్. ఈ రోజుల్లో గుండెపోటు కేసులు సర్వసాధారణంగా మారుతున్నాయి. ఇక, చలికాలంలో ఈ ప్రమాదం పెరుగుతుంది. మీకు ఇప్పటికే గుండె జబ్బులు ఉంటే.. జాగ్రత్త అవసరం. మీకు గుండెపోటు ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. చలికాలంలో పెరిగిన చలి ధమనులను సంకోచించేలా చేస్తుంది. ఇది రక్తపోటును పెంచుతుంది. గుండెపై ఒత్తిడిని పెంచుతుంది. చల్లని వాతావరణంలో శరీరాన్ని వెచ్చగా ఉంచడానికి గుండె ఎక్కువ కష్టపడాల్సి ఉంటుంది. ఇది రక్తపోటు పెరిగే ప్రమాదాన్ని పెంచుతుంది. రక్తపోటు పెరగడం వల్ల గుండెపోటు కేసులు నమోదవుతాయి. ఇక, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ అమన్‌దీప్ అగర్వాల్ గుండెపోటు అకస్మాత్తుగా రాదని వివరిస్తున్నారు. వాటి లక్షణాలు ముందుగానే కనిపిస్తాయి. అయితే, చలికాలంలో కనిపించే కొన్ని లక్షణాలు చాలా మంది లైట్ తీసుకుంటారు. చాలా మంది ఈ లక్షణాల్ని చలి వల్ల లేదా గ్యాస్ ట్రబుల్ అనుకోని పొరపాటు చేస్తారు. అయితే, ఆ లక్షణాలే తర్వాత గుండెపోటుగా మారవచ్చని డాక్టర్ అంటున్నారు. చలికాలంలో పొరపాటున కూడా విస్మరించకూడని లక్షణాలేంటో డాక్టర్ అమన్‌దీప్ తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో షేర్ చేశారు. ఆ పూర్తి వివరాలపై ఓ లుక్కేద్దాం.



ఉదయం నిద్ర లేచినప్పుడు బరువుగా లేదా ఊపిరాడనట్లు అనిపించడం

శీతాకాలంలో ఉదయం నిద్రలేచినప్పుడు బరువుగా లేదా ఊపిరాడనట్టు అనిపిస్తే.. ఆ లక్షణాన్ని ఎట్టి పరిస్థితుల్లో తేలికగా తీసుకోకూడదని డాక్టర్ అమన్‌దీప్ అంటున్నారు. చాలా మంది గ్యాస్ ట్రబుల్ అనుకుంటారు. ఇంకొందరు చలికి ఇప్పటిదాకా దుప్పటిలో ఉన్నాం కదా.. అందుకే ఊపిరాడనట్టు అనిపిస్తుందని భావిస్తారు. అయితే, ఇది వాస్తవానికి గుండెకు రక్త సరఫరాలో అడ్డంకికి సంకేతం కావచ్చు. ముఖ్యంగా ఈ నొప్పి చాలా కాలం పాటు కొనసాగితే.. శ్వాస తీసుకోవడం ఇబ్బంది కలుగుతుంది. దీంతో పాటు నొప్పి ఛాతీ, మెడ, దవడ, ఎడమ చేతికి వ్యాపిస్తే మీరు వెంటనే వైద్యుణ్ని సంప్రదించాలి.

కొంచెం నడిచినా ఊపిరి ఆడకపోవడం

ఇది కేవలం వయసు కారణంగా అనుకోవచ్చు. లేదంటే బలహీనత లేదా ఊబకాయం అని భావించి చాలా మంది ఈ లక్షణాన్ని లైట్ తీసుకుంటారు. అయితే, ఇది తీవ్రమైన గుండె సమస్యకు సంకేతం కావచ్చని డాక్టర్ అంటున్నారు. గుండె శరీరమంతా సరైన మొత్తంలో ఆక్సిజన్‌తో కూడిన రక్తాన్ని పంప్ చేయనప్పుడు, తక్కువ శ్రమ కూడా శ్వాస ఆడకపోవడానికి కారణమవుతుంది. శీతాకాలంలో గుండె ఎక్కువ ఒత్తిడికి లోనవుతున్నందున ఈ సమస్య తీవ్రమవుతుంది. అందుకే దీనిని అలసటగా తోసిపుచ్చే బదులు, వైద్యుణ్ని సంప్రదించి ఓ క్లారిటీ తీసుకోండి.

ఎడమ భుజం, వీపు, దవడలో నొప్పి

ఎడమ భుజం, వీపు లేదా దవడలో అకస్మాత్తుగా వివరించలేని నొప్పి ఎదురైతే, దానిని చిన్న కండరాల ఒత్తిడిగా తోసిపుచ్చకండి. గుండె సంబంధిత నొప్పి ఛాతీకి మాత్రమే పరిమితం కాదు. ఇది నరాల ద్వారా శరీరంలోని వివిధ భాగాలకు కూడా వ్యాపిస్తుంది. ఈ నొప్పి ఎల్లప్పుడూ తీవ్రంగా ఉండదని గమనించడం ముఖ్యం. ఇది కొన్నిసార్లు తేలికపాటి దృఢత్వం లేదా ఒత్తిడిగా కూడా ఉంటుంది. అందుకే ఈ లక్షణాన్ని లైట్ తీసుకోకండి.

కారణం లేకుండా చెమటలు పడటం

చలికాలంలో శ్రమ లేకుండా చెమటలు పడుతుంటే, దానిని సాధారణం అని కొట్టిపారేయడం తెలివైన పని కాదు. సాధారణంగా చలికాలంలో చెమటలు పట్టవు. డాక్టర్ అమన్‌దీప్ ప్రకారం, ఇది గుండెపోటుకు ముందస్తు సంకేతం కావచ్చు. ముఖ్యంగా చెమట చల్లగా ఉంటే, శరీరం జిగటగా అనిపిస్తే వెంటనే అలర్ట్ అవ్వండి. చెమటలతో పాటు ఆందోళన కూడా ఉంటే.. వెంటనే డాక్టర్‌ని సంప్రదించడం మేలు అని అమన్‌దీప్ అంటున్నారు.

విశ్రాంతి తీసుకున్నా తగ్గని అలసట

సరైన విశ్రాంతి, మెరుగైన నిద్ర తర్వాత కూడా మీరు అలసిపోయినట్లు అనిపిస్తే, దానిని సాధారణ విషయంగా భావించకూడదని డాక్టర్ అమన్‌దీప్ అంటున్నారు. కొన్నిసార్లు గుండె రక్తాన్ని సరిగ్గా పంప్ చేయలేకపోతుంది. ఇది శరీర అవయవాలకు తగినంత ఆక్సిజన్ చేరకుండా నిరోధిస్తుంది. ఇది శరీర శక్తిని నేరుగా ప్రభావితం చేస్తుంది. దీంతో మీరు ఏం చేయకుండానే అలసిపోయినట్టు భావిస్తారు. ఇది విశ్రాంతి తీసుకున్న తర్వాత కూడా పోదు. అందుకే ఈ లక్షణం కనిపించినా వెంటనే అలర్ట్ అవ్వండి.

విటమిన్ బి12 లోపం ఉంటే...

మన శరీరానికి అన్నీ విటమిన్స్ సరిగ్గా అందినప్పుడు బాడీ పనితీరు మెరుగ్గా ఉంటుంది. ఏదైనా విటమిన్ తగ్గినప్పుడు ఆయా విటమిన్ లోపం ఏర్పడుతుంది. అలానే బి12 తగ్గినప్పుడు బి12 లోపం ఏర్పడుతుంది. దీనిని కొన్ని లక్షణాల ద్వారా ముందుగానే గుర్తించాలి. లేదంటే భవిష్యత్‌లో చాలా సమస్యలొచ్చే అవకాశం ఉంది. ఆ వివరాల గురించి తెలుసుకుని ఏయే జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకోండి. బాడీలో తగినంత బి12 లేనప్పుడు బి12 విటమిన్ లోపం ఏర్పడుతుంది. దీనిని కొన్ని లక్షణాల తర్వాత గుర్తించాలి. వయసు పెరగడం, కొన్ని రకాల ట్రీట్‌మెంట్స్, పోషకాహార లోపం వంటి ఇతర కారణాల వల్ల సమస్య ఏర్పడుతుంది. దీనిని మనం ముందుగా లక్షణాలతో గుర్తించి ఆ తర్వాత రక్త పరీక్ష ద్వారా చెక్ చేయించుకోవచ్చు. దీంతో సమస్యని గుర్తించొచ్చు. దీని గురించి హోమియోపతి డాక్టర్ లక్ష్మీపతి రాజు చాలా వివరాల గురించి చెబుతున్నారు. సమస్య ఉంటే బాడీలో ఏయే లక్షణాలు ఉంటాయి. ఎలా గుర్తించాలో ఆయన చెబుతున్నారు.

అరచేతులు, కాళ్ళలో సూదులతో గుచ్చినట్లుగా...

అరచేతుల్లో, అరి కాళ్ళలో సూదులతో పొడిచినట్లుగా, గుచ్చినట్లుగా అనిపించినా లేదా కొద్దిగా మొద్దుబారి తిమ్మిరిగా అనిపించినా సమస్య లక్షణమే. దీనిని పారేస్తిషియా అంటారు. విటమిన్ బి12 లోపం ఏర్పడినప్పుడు ఈ లక్షణం ముఖ్యంగా కనిపిస్తుంది. ఇండియాలో దాదాపు 75 శాతం మందికి ఈ లోపం ఏర్పడుతుంది.

చర్మ రంగు మారడం

సాధారణంగా మనిషి రంగు ముందునుంచీ ఒకేలా ఉంటుంది. అయితే, సడెన్‌గా పసుపు రంగులోకి మారిందంటే సమస్య ఉన్నట్లుగా గుర్తించాలి. ఇది పచ్చకామెర్ల వల్ల కూడా ఇలానే జరుగుతుంది. కానీ, పరీక్షించి ఏ కారణం వల్ల చర్మ రంగు మారిందో తెలుసుకోవడం చాలా ముఖ్యం.

నోటిలో పుండ్లు రావడం

నోటిలో పుండ్లు మాటిమాటికీ వస్తుంటాయి. దీనికి కారణం కూడా చాలా వరకూ విటమిన్ బి12 లోపం వల్లే. నాలుక రంగు మారి వాపుగా ఉండడం, నాలుక మొత్తం ఎర్రగా మారిపోతుంది. దీంతో ఏం తినాలన్నా, తాగాలన్నా కష్టంగానే ఉంటుంది. సమస్య పెరిగితే నీటిని తాగాలన్నా కూడా ఇబ్బందిగా ఉంటుంది.

నడకలో మార్పు రావడం

మనకి విటమిన్ బి12 లోపం ఉంటే నడకలో మార్పు వచ్చి ఇన్‌బ్యాలెన్స్ అవుతుండడం కూడా బి12 విటమిన్ లోపం కారణంగానే జరుగుతుంది. సరిగ్గా నడవలేరు. ఇలా ఉన్నప్పుడు నీరసంగా ఉన్నందుకే, ఇలా అవుతుందని నిర్లక్ష్యం వద్దు. ముందుగానే అలర్ట్ అయి చెక్ చేసుకోవాలి. బి12 విటమిన్ తగ్గినప్పుడు చూపు కూడా మందగిస్తుంది. సరిగ్గా చూడలేరు. అలాంటప్పుడు చూపు తగ్గిందని లేదా సైట్ పెరిగిందనుకోకుండా సమస్య ఉందో ముందుగానే గుర్తించడం చాలా ముఖ్యం.

అగ్రంపహాడ్ జాతర ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయండి

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

హన్మకొండ మహా: అగ్రంపహాడ్ సమ్మక్క, సారలమ్మ జాతరకు అధికారులు సమన్వయంతో తగిన ఏర్పాట్లను పూర్తి చేసి విజయవంతంగా నిర్వహించాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం అగ్రంపహాడ్ లోని శ్రీ సమ్మక్క, సారలమ్మ ఆలయ ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ తో కలిసి జాతర ఏర్పాట్లు, నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం సమీక్షా సమావేశంలో వారు పాల్గొన్నారు. దేవాదాయ, రెవెన్యూ, పోలీస్, వైద్య ఆరోగ్య, విద్యుత్, ఆర్టీసీ, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, సాగునీటిపారుదల, ఎక్సైజ్, అగ్నిమాపక, ఇతర శాఖల అధికారులతో ఆయా శాఖల ఆధ్వర్యంలో చేయాల్సిన జాతర ఏర్పాట్ల గురించి ఎమ్మెల్యే, కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ అగ్రంపహాడ్ శ్రీ సమ్మక్క సారలమ్మ జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తిచేసి ప్రశాంతంగా సాగే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. జాతరలో ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఉండాలన్నారు. జాతరకు లక్షలాది మంది భక్తులు తరలి వస్తుంటారు కాబట్టి వాహనాల పార్కింగ్ సమస్య తలెత్తకుండా తగిన స్థలాలను గుర్తించి ఏర్పాట్లు చేయాలన్నారు. పార్కింగ్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు చుట్టుపక్కల రైతులతో మాట్లాడి పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలని, సంబంధిత రైతులకు ఐదు వేల పరిహారం అందజేయాలన్నారు. జాతరకు వచ్చే రహదారులలో మూలమలుపులు ఎక్కువగా ఉన్నాయని వాటి వద్ద తగిన జాగ్రత్త చర్యలు అధికారులు చేపట్టాలన్నారు. భక్తులు స్నానాలు చేసే ఎస్సారెస్పీ కెనాల్ లో తగిన నీరు ఉండేవిధంగా, అదేవిధంగా అగ్రంపహాడ్ చెరువు వద్ద కూడా నాణ్యమైన నీటిని సరఫరా చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. వివిధ శాఖల అధికారులు సమావేశం అనంతరం జాతర ఏర్పాట్లపై సమీక్ష చేసుకుని స్థల పరిశీలన చేసి తగిన చర్యలు చేపట్టాలన్నారు. జాతరలో సౌకర్యం మెరుగ్గా ఉండాలని, అదనంగా నీటి వసతులు కల్పించాలని మిషన్ భగీరథ శాఖ అధికారులకు సూచించారు. నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని, ఎక్కడ కూడా విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్ల వెంట తప్పనిసరిగా విద్యుత్ దీపాలు ఉండాలన్నారు. అదనంగా పోల్స్ ఏర్పాటు చేసి లైట్స్ పెట్టాలన్నారు. రోడ్లకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేయించాలన్నారు. జాతరలో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో వాహనం అందుబాటులో ఉండాలన్నారు. జాతరలో గుడుంబా నియంత్రణకు పోలీస్, ఎక్సైజ్ శాఖలు సంయుక్తంగా చర్యలు చేపట్టాలన్నారు. ఆలయ ప్రాంగణంలో పటిష్ట క్యూలైన్లు ఏర్పాట్లు చేయాలన్నారు. పారిశుధ్య నిర్వహణ మెరుగ్గా ఉండాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. వచ్చేనెల 20వ తేదీన మరోసారి జాతర ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ జిల్లాలోనే అగ్రంపహాడ్ సమ్మక్క, సారలమ్మ జాతర పెద్ద జాతర అని, ఈ జాతరకు సుమారుగా పది నుండి 12 లక్షలు మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకునేందుకు వస్తారని అన్నారు. ఇక్కడ దర్శనం చేసుకున్న అనంతరం మేడారానికి భక్తులు తరలి వెళ్తుంటారని పేర్కొన్నారు. లక్షల సంఖ్యలో భక్తులు దర్శనం కోసం వస్తుంటారు కాబట్టి జాతరకు పటిష్ట ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. జాతర ఏర్పాట్లు, నిర్వహణ పై మరోసారి సమీక్ష చేయనున్నట్లు పేర్కొన్నారు. పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆలయ ఈవో నాగేశ్వర్ రావు మాట్లాడుతూ జాతర నిర్వహణకు దేవాదాయ శాఖ తరఫున ఏర్పాట్లు పూర్తి చేస్తామని అన్నారు. గతంలో 50 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని ఈ జాతరకు వంద సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో పరకాల ఆర్డీవో డాక్టర్ కన్నం నారాయణ, పరకాల ఏసీపీ సతీష్ బాబు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, విద్యుత్ శాఖ ఎస్ఈ మధుసూదన్, పంచాయతీ రాజ్ ఈఈ ఆత్మారామ్, ఆర్టీసీ డీఎం ధరంసింగ్, తహసిల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఇతర అధికారులతో పాటు అగ్రంపహాడ్, అక్కంపేట, పెద్దాపూర్ సర్పంచులు మహేందర్, సాంబయ్య, రాజేశ్వరరావు, వివిధ గ్రామాల ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవ్యవస్థలో అడ్వకేట్ల పాత్ర అత్యంత కీలకం

మహా, హైదరాబాద్ : నాంపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడి జన్మదినం & నూతన సంవత్సర వేడుకలు అధికారికంగా నిర్వహణ హైదరాబాద్ నాంపల్లి కోర్టు ప్రాంగణంలో నాంపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు రవికిశోర్ జన్మదిన వేడుకలు మరియు నూతన సంవత్సర వేడుకలు శుభప్రదంగా, అధికారికంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జ్ శ్రీ సురేష్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమానికి విశిష్టతను చేకూర్చారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి సురేష్ మాట్లాడుతూ.... న్యాయవ్యవస్థలో అడ్వకేట్ల పాత్ర అత్యంత కీలకమని, బార్-బెంచ్ మధ్య సమన్వయం మరింత బలోపేతం కావడం ద్వారా న్యాయసేవలు ప్రజలకు సమర్థవంతంగా అందుతాయని పేర్కొన్నారు. నాంపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు రవికిశోర్ న్యాయవృత్తి అభివృద్ధికి అందిస్తున్న సేవలను ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో నాంపల్లి బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఎన్.వి. రమణగౌడ్, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (DLSA) ప్యానల్ అడ్వకేట్ డా. రామకృష్ణ చౌదరి కొదారి, బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, సీనియర్ అడ్వకేట్లు, యువ అడ్వకేట్లు ఇతర కోర్టు సిబ్బంది పాల్గొని అధ్యక్షులు రవికిశోర్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, నూతన సంవత్సర శుభాకాంక్షలు అందజేశారు. అనంతరం కేక్ కట్ చేయడం, పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకోవడం జరిగింది. సౌహార్ద వాతావరణంలో ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

తెలంగాణ బార్ కౌన్సిల్ నామినేషన్ల ప్రక్రియ పూర్తి

సుమారు 200 దరఖాస్తులు

మహా, హైదరాబాద్ : తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ విజయవంతంగా పూర్తయ్యింది. ఈ నామినేషన్లకు సుమారు 207 దరఖాస్తులు అందాయి. ఇందులో యువ, సీనియర్ న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా, 30 శాతం మహిళా రిజర్వేషన్ కారణంగా మహిళా న్యాయవాదులు కూడా ఉత్సాహంగా నామినేషన్లు దాఖలు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ బార్ కౌన్సిల్‌కు సంబంధించిన న్యాయవాదులు జితేందర్ రెడ్డి, జే. లక్ష్మణ్, పి. రవీందర్ తమ నామినేషన్లను అధికారికంగా దాఖలు చేశారు. న్యాయవృత్తిలో ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేసే విధంగా నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించబడింది. మహిళా న్యాయవాదులకు కల్పించిన రిజర్వేషన్ వల్ల వారి భాగస్వామ్యం మరింత పెరిగిందని న్యాయవర్గాలు అభిప్రాయపడ్డాయి. బార్ కౌన్సిల్ ఎన్నికల ప్రక్రియలో నామినేషన్ల దశ పూర్తికావడం, తదుపరి ఎన్నికల ప్రక్రియకు కీలకమైన ముందడుగుగా భావించబడుతోంది.

రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలి

కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ మహా: ప్రతి పౌరుడు భారత రాజ్యాంగం పట్ల అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం స్థానిక బొక్కల్‌గూడలో పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు డప్పుచప్పుళ్లతో ఘన స్వాగతం పలికి గ్రామదేవతకు పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్‌తో పాటు అధికారులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ రాజ్యాంగం గురించి అవగాహన కలిగి ఉండాలని, అన్ని వర్గాల ప్రజలకు హక్కులు రాజ్యాంగం ద్వారానే లభిస్తున్నాయని తెలిపారు. విద్య ద్వారా గౌరవం లభిస్తుందని, విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లు అలవరచుకోవాలని సూచించారు. ఆడపిల్లలకు ఎలాంటి పరిమితులు విధించకుండా తల్లిదండ్రులు వారి విద్య, భవిష్యత్తుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. సమాజంలో మద్యం, మత్తు పదార్థాలకు అలవాటు పడి యువత చెడిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తూ, వాటిపై జిల్లా యంత్రాంగం ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ చట్టాన్ని గౌరవిస్తూ సేవాభావంతో పని చేయాలని, మంచి పనుల ద్వారా సమాజంలో చిరస్థాయిగా నిలవాలని సూచించారు. గుట్కా వంటి క్యాన్సర్ కారకమైన చెడు అలవాట్లను విడిచిపెట్టి, ఆరోగ్యంపై దృష్టి సారిస్తూ కొత్త సంవత్సరం నుండి మంచి తీర్మానాలు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం వృద్ధులకు చేతికర్రలు, మంకీ క్యాపులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్, అర్బన్ తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్ఐ అశోక్, ఎంఈవో సోమయ్య, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు శశికాంత్, తోట విజయ్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవిదాస్, రెవెన్యూ సిబ్బంది ప్రకాష్, కాలనీ వాసులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమీక్షా సమావేశం

నిర్మల్ మహా: మున్సిపాలిటీల ఎన్నికలకు సంబంధించి పోలింగ్ స్టేషన్ల వారీ ముసాయిదా ఓటర్ల జాబితా తయారీ, ప్రచురణ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, లోపాలు లేకుండా నిర్వహించడమే ముఖ్య లక్ష్యమని తెలిపారు. మున్సిపాలిటీలకు సంబంధించిన పోలింగ్ స్టేషన్ల వారీ ముసాయిదా ఓటర్ల జాబితా జనవరి 1వ తేదీన సంబంధిత నోటీసు బోర్డులపై ప్రచురిస్తామని వివరించారు. జాబితాలో పేర్లు, చిరునామాలు లేదా ఇతర వివరాల్లో ఏవైనా తప్పులు, అభ్యంతరాలు ఉంటే, నిబంధనల ప్రకారం సకాలంలో సంబంధిత మున్సిపల్ కమిషనర్లకు లేదా జిల్లా అధికారులకు సమర్పించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. వారి ద్వారా వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం మున్సిపాలిటీల పోలింగ్ స్టేషన్ల వారీ తుది ఓటర్ల జాబితాను 2026 జనవరి 10వ తేదీన ప్రచురించనున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు, సమగ్ర ఓటర్ల జాబితా రూపొందించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్న కళ్యాణి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు అప్పల గణేష్, శ్రావణ్ రెడ్డి, అజంబిన్ యహీయా, రాము, సయ్యద్ హైదర్, నాందేడపు చిన్ను, భరత్వి, జయ్, మజార్, వినోద్, సాదిక్, తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో పతకాల పంట..

వివిధ విభాగాల్లో రాష్ట్ర ప్రభుత్వ సేవా పతకాల కైవసం



కరీంనగర్ మహా : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే శౌర్య, మహోన్నత, ఉత్తమ, కఠిన సేవ, సేవా పతకాలను ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. విధి నిర్వహణలో అత్యంత ప్రతిభ, అంకిత భావం అసమానమైన సేవలందించిన అధికారులకు ఈ విశిష్ట గౌరవం దక్కింది. ఈ జాబితాలో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన పలువురు ఉన్నతాధికారులతో పాటు సిబ్బంది పెద్ద సంఖ్యలో పతకాలను సాధించి కమిషనరేట్ కీర్తిని చాటారు.

తెలంగాణ పోలీస్ మహోన్నత సేవా పతకాలు:

కరీంనగర్ కమిషనరేట్ నుండి కింది ఉన్నతాధికారులు ఈ గౌరవప్రదమైన పతకానికి ఎంపికయ్యారు:
ఎం. భీంరావు: అడిషనల్ డీసీపీ (ఏ ఆర్), కరీంనగర్.
పి. వెంకట రమణ: అడిషనల్ డీసీపీ (అడ్మిన్), కరీంనగర్.

ఉత్తమ సేవా పతకాలు:

విధి నిర్వహణలో అత్యుత్తమ అంకితభావం ప్రదర్శించినందుకు ఎంపిక..
సయ్యద్ అన్వర్ ఎస్ఐ, సీటీసీ, కరీంనగర్.
ఎస్. శ్రీనివాస్ : సబ్ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, చిగురుమామిడి పోలీస్ స్టేషన్, కరీంనగర్.
ఇ. చుక్కా రెడ్డి : హెడ్ కానిస్టేబుల్ (HC 362), సీసీఆర్ బీ, కరీంనగర్.

కఠిన సేవా పతకాలు:

క్లిష్టతరమైన విధులను సమర్థ సేవలకు గుర్తింపు..
ఇన్‌స్పెక్టర్లు & సబ్ఇన్స్పెక్టర్లు:
టి. కరుణాకర్: ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, హుజూరాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్.
వి. శ్రీనివాస్: ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, సీ ఎస్బి కరీంనగర్.
ఎ. సత్యనారాయణ: సబ్ఇన్స్పెక్టర్, Iటౌన్ పోలీస్ స్టేషన్, కరీంనగర్.
ఖాజా జమలుద్దీన్: ఏ ఎస్ ఐ 1094, మానకొండూరు పోలీస్ స్టేషన్.
సయ్యద్ పాషా: ఏ ఎస్ ఐ 1482, వీణవంక పోలీస్ స్టేషన్.
టి. మనోజ్ కుమార్: ఏ ఎస్ ఐ 1689, రామడుగు పోలీస్ స్టేషన్.
ఆర్. సమ్మయ్య: ఏ ఎస్ ఐ 1874, చొప్పదండి పోలీస్ స్టేషన్.
ఎన్. దామోదర చారి: ఏ ఎస్ ఐ 2050, వీణవంక పోలీస్ స్టేషన్.
గోలాడ సదయ్య: ఏ ఎస్ ఐ 1822, ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్.
ఎండి. అంకుషావలి: ఏ ఆర్ ఎస్ ఐ, సి ఏ ఆర్, కరీంనగర్. పి. శ్రీనివాస్ (హెచ్ సీ 2058): రామడుగు పోలీస్ స్టేషన్. పి. చంద్రమౌళి (హెచ్ సీ 322): గంగాధర పోలీస్ స్టేషన్. పి. శ్రీరాములు (హెచ్ సీ 1563): ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, కరీంనగర్. బి. అంజయ్య (హెచ్ సీ 1564): ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, కరీంనగర్. ఇ. తిరుపతి (హెచ్ సీ 1580): గన్నేరువరం పోలీస్ స్టేషన్. సయ్యద్ అలీముద్దీన్ (హెచ్ సీ 977): ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, కరీంనగర్. ఎండి. ఖాజా అజీముద్దీన్ (హెచ్ సీ 2097): రామడుగు పోలీస్ స్టేషన్. టి. కైలాస్ సింగ్ (హెచ్ సీ 2191): కేశవపట్నం పోలీస్ స్టేషన్. బి. రవీందర్ రెడ్డి (హెచ్ సీ 2165): సీ సీ ఆర్ బీ, కరీంనగర్. సిహెచ్. ఆంజనేయులు (హెచ్ సీ 2299): కరీంనగర్ I (టౌన్) పోలీస్ స్టేషన్. ఎస్. రాంచందర్ (హెచ్ సీ 2183): ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, కరీంనగర్. ఎం. మల్లయ్య (హెచ్ సీ 2259): హుజూరాబాద్ (టౌన్) పోలీస్ స్టేషన్. ఎండి. సుల్తాన్ సలావుద్దీన్ (హెచ్ సీ 1965): రూరల్ పోలీస్ స్టేషన్, కరీంనగర్. పి. కొమురయ్య (పీ సీ 2779): IIIటౌన్ పోలీస్ స్టేషన్, కరీంనగర్. బి. సత్యనారాయణ (పీ సీ 2902): మానకొండూరు పోలీస్ స్టేషన్. జి. అంజయ్య (ఏ ఆర్ పీ సీ 2619): CAR, కరీంనగర్. కె. లింగారెడ్డి (పీ సీ 660): చిగురుమామిడి పోలీస్ స్టేషన్. పతకాలు సాధించిన ప్రతీ ఒక్కరిని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ప్రత్యేకంగా అభినందించారు. ఈ అవార్డులు వారి వృత్తిపరమైన బాధ్యతను మరింత పెంచుతాయని తోటి సిబ్బందికి స్ఫూర్తినిస్తాయని వారు పేర్కొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

మంచిర్యాల ఎమ్మెల్యే, కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల, మహా : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం మంచిర్యాల పట్టణంలో పద్మనాయక కళ్యాణమండపంలో ఏర్పాటు చేసిన కళ్యాణలక్ష్మి/ షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి వీరిద్దరూ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమంతో పాటు మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందించే విధంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు ప్రవేశపెట్టి సమర్థవంతంగా అమలు చేస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా పేదింటి ఆడపిల్ల పెళ్లికి ప్రభుత్వం కళ్యాణలక్ష్మి/ షాదీ ముబారక్ ద్వారా నగదు అందజేస్తుందని స్పష్టం చేశారు. మంచిర్యాల మండలానికి చెందిన 95 మంది, హాజీపూర్ మండలానికి చెందిన 43 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చి ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా అనేక వ్యాపారాలలో అభివృద్ధి చెందే దిశగా ప్రోత్సహిస్తుందని తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, గృహ జ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా అనేక వ్యాపార రంగాలలో ప్రోత్సహిస్తూ పెట్రోల్ బంకులు, సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు వంటి అనేక పథకాలను అమలు చేస్తుందని తెలిపారు.

పేదింటి పెళ్లి వేదికకు కాంగ్రెస్ కానుక

చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్ నగర్. మహా: పేదింటిలో జరిగే వివాహ శుభ కార్యాలకు కాంగ్రెస్ అందించిన కానుక పేరే కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొందుర్గు, కేశంపేట మండలాల లబ్ధిదారులకు బుధవారం క్యాంపు కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన అందజేశారు. పేదింటి పిల్లల వివాహాల కోసం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ముందస్తుగా ఈ చెక్కుల పంపిణీ చేయడం జరిగిందన్నారు. పేదింటి ఆడపడుచులకు ఈ సందర్భంగా ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని అన్నారు. మొత్తం రెండు మండలాలలో కలిపి కొందుర్గు మండలంలో 28, కేశంపేట మండలంలో 55 మంది లబ్ధిదారులకు రూ.86,09,986 లక్షల విలువైన చెక్కులను అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం నిరుపేదల సంక్షేమం గురించే ఆలోచిస్తుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, శ్రీధర్ రెడ్డి, వీరేశం, కృష్ణారెడ్డి, ఇబ్రహీం, అగునూరు బస్వం, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలోని వార్డుల ఓటర్లను సవరించాలి

కమిషనర్ కు వినతిపత్రం అందిస్తున్న మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు

ఆమనగల్లు, మహా : ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 15 వార్డుల్లో ఉన్న ఓట్లను వార్డుల వారిగా విభజించాలని బుధవారం మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ కు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. 1 వ వార్డ్ చంద్రాయన్ పల్లి తండా పరిధిలోని కాటన్ మిల్లు ఓట్లను తొలగించి.. తండా వరకే కొనసాగించాలని, 2 వ వార్డు ముర్తోజుపల్లి లో సాకిబండ తండా ఓట్లు ఉన్నందున అవి అక్కడి నుంచి తొలగించి, 4 వ వార్డు పరిధిలోని జంగారెడ్డి పల్లి ఓట్లు నుచ్చుకుంట తండాలో ఉన్నాయి. అక్కడ ఉన్న ఓట్లను తొలగించి జంగారెడ్డిపల్లి లో ఏర్పాటు చేయాలని, 9వ వార్డు ఓట్లు విటాయిపల్లి లో ఉన్నాయి, విటాయిపల్లి లో ఉన్న ఓట్లను విటాయిపల్లిలోనే కొనసాగించాలని, అదేవిధంగా వివిధ వార్డుల్లో ఉన్న ఓటర్లను కూడా వార్డుల వారీగా విభజించాలని వినతిపత్రంలో కమిషనర్ ను కోరారు. వినతి అందించిన వారిలో మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు, తోట శ్రీను, మాజీ కోఆప్షన్ మెంబర్ ఖాదర్ ఖాద్రి, కృష్ణ నాయక్, పూసల సత్యం, మల్లేష్ నాయక్, చెన్నారెడ్డి, మైసయ్య, కుమార్ గౌడ్, శ్రీను నాయక్, ఖాదర్, హలీం, నాజర్, రఫీ, వాటర్ బాబా, మహేష్, పాతకోట రాజు, గౌస్, ఎంగలి ప్రసాద్, జైపాల్ తదితరులు ఉన్నారు

షాద్ నగర్ ఇక పటిష్ట రక్షణ వలయం

షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్ నగర్. మహా, షాద్ నగర్ నియోజకవర్గ ప్రాంతం ఇక పటిష్టమైన రక్షణ వలయంగా మారబోతుందని, డిప్యూటీ కమిషనరేట్ ఏర్పాటుతో పలు మార్పులు సంభవించనున్నాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మార్పు కారణంగా నేరాల నిరోధానికి పూర్తి అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. అదేవిధంగా ఇప్పటిదాకా శంషాబాద్ పరిధిలో ఉన్న నియోజకవర్గంలోని కొత్తూరు, నందిగామ మండలాలు షాద్ నగర్ పరిధిలోకే వస్తాయన్నారు. దీనివల్ల అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు దూరం అవుతాయని వెల్లడించారు. అదేవిధంగా కేశంపేట మండలం ఆమనగల్ ఏసీబీ పరిధిలోకి వెళ్లినట్లుగా ప్రచారం జరిగిందని, ఇది వాస్తవం కాదని అన్నారు. మొదట పోలీసు శాఖ ఆ విధంగా రూట్ మ్యాప్ ఏర్పాటు చేసినప్పటికీ తాను అభ్యంతరం చెప్పడం జరిగిందన్నారు. ప్రస్తుతం కేశంపేట కూడా షాద్ నగర్ కమిషనరేట్ పరిధిలోకి వస్తుందని వెల్లడించారు. దీనివల్ల పోలీసులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి విలువైన సేవలు అందిస్తారని ఆయన స్పష్టం చేశారు. షాద్ నగర్ పారిశ్రామిక ప్రాంతంగా, వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెంది ఉండటం వల్ల నేరాలకు అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. అదేవిధంగా 44వ నెంబరు జాతీయ రహదారి ఉండడం వల్ల రోడ్డు ప్రమాదాలకు కూడా ఆస్కారం ఎక్కువగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో పోలీసు శాఖ మరింత పటిష్టం కావడం వల్ల నేరాలను, ఘోరాలను నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. నియోజకవర్గాన్ని నేరాలకు దూరంగా ప్రశాంతంగా ఉంచడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. అంతకుముందు మాజీ జెడ్పిటిసి విశాల శ్రావణ్ రెడ్డి దంపతులు, అదేవిధంగా మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వరప్ప, మండల పార్టీ అధ్యక్షుడు వీరేశం, సర్పంచులు అఖిల్, భాస్కర్ గౌడ్, కేశంపేట సీనియర్ నాయకుడు శ్రీధర్ రెడ్డి తదితరులు ఎమ్మెల్యేకు కేశంపేట మండలం సంబంధించిన వినతి పత్రాన్ని సమర్పించారు అయితే ఎమ్మెల్యే ముందుగానే ఈ సమస్యకు పరిష్కారం చేయడం విశేషం.

రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి

కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ మహా: జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేద ప్రజలకు కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ వైద్య ఆరోగ్య శాఖపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఏడాది కాలంలో జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి, ప్రసూతి ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలు తదితర అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు అందించిన వైద్య సేవల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇన్‌పేషెంట్, అవుట్‌పేషెంట్ సేవలు, ఇతర వైద్య సదుపాయాలు, ఆసుపత్రుల్లో కల్పించిన మౌలిక వసతులపై సమీక్షించారు. ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మరింత మెరుగైన వైద్యం అందేలా అన్ని స్థాయిల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా వైద్య కళాశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. వైద్య కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులు 99 శాతం ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమని పేర్కొంటూ విద్యార్థులు, అధ్యాపకులను అభినందించారు. రానున్న రోజుల్లో కూడా మెరుగైన బోధన అందిస్తూ ఇలాంటి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాలలో మౌలిక సదుపాయాల పనులు ఏవైనా పెండింగ్‌లో ఉంటే వెంటనే పూర్తి చేసి, విద్యార్థులకు అనుకూల వాతావరణంలో విద్యాభ్యాసం చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం గ్రామీణ ప్రజల కోసం వారి నివాస ప్రాంతాల్లోనే క్షయ వ్యాధిని గుర్తించే పోర్టబుల్ ఎక్స్‌రే యంత్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు క్షయ వ్యాధి నిర్ధారణలో ఈ యంత్రం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. దీని ద్వారా ప్రజలకు ప్రయాణ భారం తగ్గి, వేగంగా చికిత్స ప్రారంభించేందుకు అవకాశం కలుగుతుందని అన్నారు. యంత్రం పనితీరును అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రాజేందర్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు గోపాల్సింగ్ సరోజ, సురేష్, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏసిపి కార్యాలయం ఏర్పాటు చేయడం హర్షనీయం

ఆమనగల్లు మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు

ఆమనగల్లు : శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఆమనగల్లు మండల కేంద్రంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ మల్లు రవిల కృషితో ఏసీపీ కార్యాలయం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆమనగల్లు మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు అన్నారు. నాలుగు మండలాలకు ప్రధాన కూడలి అయిన ఆమనగల్లు మండల కేంద్రంలో ఎమ్మెల్యే, ఎంపీ సహకారంతో అతి త్వరలో సబ్ రిజిస్టర్, ఎస్టీవో, అన్ని డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేస్తామని తెలిపారు. డివిజన్ కార్యాలయం ఏర్పాటుతో ఈ ఈ ప్రాంత ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో తోట శ్రీను, మాజీ కోఆప్షన్ మెంబర్ ఖాదర్ ఖాద్రి, కృష్ణ నాయక్, పూసల సత్యం, మల్లేష్ నాయక్, చెన్నారెడ్డి, మైసయ్య, కుమార్ గౌడ్, శ్రీను నాయక్, ఖాదర్, హలీం, నాజర్, రఫీ, వాటర్ బాబా, మహేష్, పాతకోట రాజు, గౌస్, ఎంగలి ప్రసాద్, జైపాల్ తదితరులు ఉన్నారు

ఆ అయ్యప్ప స్వామి కృప, ఆశీస్సులు ఉండాలి

షాద్ నగర్, మహా: కేశంపేట మాజీ జడ్పిటిసి శ్రీమతి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి వివాహ వార్షికోత్సవం అభిమానుల, కార్యకర్తల మధ్య ఘనంగా నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా బుధవారం పట్టణంలో శివ మారుతి గీతా అయ్యప్ప స్వామి దేవాలయంలో 44వ రోజు అయ్యప్ప స్వాములకు కేశంపేట్ మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి వివాహ వార్షికోత్సవ సందర్భంగా అయ్యప్ప స్వాములకు నిర్వహించిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ మాజీ ఎమ్మెల్యే చౌల్లపల్లి ప్రతాపరెడ్డి హాజరయ్యారు. ఇంతకుముందు దేవాలయంలో అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు, వారి వివాహ వార్షికోత్సవం సందర్భంగా శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు

వలిగొండ ఎస్సై యుగంధర్ గౌడ్

వలిగొండ, మహా: నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ వలిగొండ ఎస్సై యుగంధర్ గౌడ్ మాట్లాడుతూ నూతన సంవత్సరంలో మండల ప్రజలు అందరూ సుఖ సంతోషాలతో క్షేమంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు నూతన సంవత్సరంలో శాంతి భద్రతలకు సహకరించాలని అన్ని గ్రామాలలో యువత సరైన మార్గంలో నడిచి గ్రామల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఆయన అన్నారు

మడికొండ పోలీస్ స్టేషన్ లో వార్షిక తనిఖీ

నేరాల నియంత్రణ కై పోలీసులు ప్రత్యేక కృషి చేయాలి .. సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత

హన్మకొండ మహా: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉన్న మడికొండ పోలీస్ స్టేషన్ ను సెంట్రల్ జోన్ డిసిపి దార కవిత వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా స్టేషన్కు విచ్చేసిన డీసీపీ కి స్థానిక మడికొండ పోలీస్ ఇన్స్పెక్టర్ పి. కిషన్ తో కలిసి కాజీపేట్ ఏసీపీ పి. ప్రశాంత్ రెడ్డి పూల మొక్కలను అందించి స్వాగతం పలుకగా స్థానిక పోలీసులు, సిబ్బంది గౌరవ వందనం చేశారు. అనంతరం స్థానిక పోలీస్ సిబ్బంది తో మాట్లాడి వారి కిట్ ఆర్టికల్స్, రికార్డులను తనిఖీ చేసిన పిదప పోలీస్ స్టేషన్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ కిషన్, ఏసీపి ప్రశాంత్ రెడ్డి తో కలిసి స్టేషన్ ఆవరణలో మామిడి మొక్కను నాటారు. తదనంతరం స్టేషన్లో ఉన్న అన్ని గదులను పరిసరాలను శుభ్రంగా ఉన్నాయా లేదా అని ప్రత్యక్షంగా చూసిన డీసీపీ స్టేషన్ కు సంబంధించిన గత మూడు సంవత్సరాల నేరాలకు సంబంధించిన వివరాలు తీసుకుని వాటిని తగ్గించడం కోసం తీసుకున్న చర్యలను తెలుసుకున్నారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు, నివారణ కోసం తీసుకున్న చర్యలు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశ అనంతరం మడికొండ పోలీస్ సిబ్బందితో మాట్లాడి సిబ్బందికి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఏవైనా సమస్యలు ఉంటే ఉన్నతధికారుల దృష్టికి తీసుకుని రావాలని సమాజంలో పోలీసుల విశ్వాసం పెరగడంలో అధికారులతో పాటు కింది స్థాయికి సిబ్బంది నిజాయితీ నిబద్ధతతో పనిచేసే మీ పాత్ర ముఖ్యమైనదని నిత్యం శాంతి భద్రతలను కాపాడుకుంటూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. చిన్న సమస్య అయిన దానికి వెంటనే ప్రతిస్పందించి సమస్యలను పరిష్కరించాలని నేర నియంత్రణకు పోలీసులు ప్రత్యేక కృషి చేయాలని రౌడీ షీటర్స్ , సస్పెక్ట్ షీట్స్ ఉన్న వ్యక్తుల మీద నిరంతరం నిఘా ఉంచాలని వారి జీవన విధానం ఎలా ఉందని, వారు నేరాలకు మళ్ళీ పాల్పడుతున్నారా లేదా అని గుర్తించాలని మహిళలు, పిల్లలు, వృద్ధులు స్టేషన్ కు వచ్చినప్పుడు వారి సమస్యలకు అత్యంత ప్రాముఖ్యతను ఇచ్చి వాటిని త్వరగా పరిష్కరించాలని సూచించారు. అంతేకాకుండా సిబ్బంది తమ ఆరోగ్యం పట్ల కుటుంబ విషయాలలో శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై లు రాజబాబు,రాజ్ కుమార్, రామ్ మోహన్, మడికొండ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగికి పదవీవిరమణ సహజం

విరమణ పొందిన పోలీస్ అధికారులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

హన్మకొండ మహా: పదవీ విరమణ అనంతరం పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యుల కోసం సమయం కేటాయించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ విభాగంలో సుదీర్ఘకాలం విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన పోలీస్ అధికారులు మంగళవారం ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. పదవీ విరమణ పొందిన వారిలో ఇన్స్పెక్టర్ ఎన్. వెంకటేశ్వర్లు, ఎస్.ఐ లు ఎ. విల్సన్, పి. ప్రకాష్, ఆర్.ఎస్.ఐ కె. ప్రభాకర్, ఏ.ఆర్.ఎస్.ఐ లు అబ్దుల్ రఫిక్, యం. రవి ఉన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సుదీర్ఘ కాలం పాటు పోలీస్ శాఖ కు సేవలందించి పదవీవిరమణ చేస్తున్న అధికారులు నేటి తరం పోలీసులకు ఆదర్శంగా నిలుస్తారని పదవీ విరమణ అనంతరం పోలీస్ సిబ్బంది ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని తెలిపారు. పదవీ విరమణ అనంతరం ప్రభుత్వం నుండి అందే డబ్బును భవిష్యత్ అవసరాలకు భద్రపర్చుకోవాలని సిపి సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డిసిపిలు రవి, సురేష్ కుమార్, శ్రీనివాస్, ఏసీపీ, సురేంద్ర, ఆర్.ఐ సతీష్, ఆర్.ఎస్.ఐ శ్రవణ్ కుమార్ తో పాటు, ఇతర పోలీస్ సిబ్బంది, పదవీ విరమణ సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు

ఉప సర్పంచ్ ఆలకుంట్ల శోభ రాజు

వలిగొండ, మహా: నూతన సంవత్సరం సందర్భంగా వలిగొండ మండల ప్రజలకు జంగారెడ్డిపల్లి ప్రజలకు ప్రజా ప్రతినిధులకు పార్టీ నాయకులకు మిత్రులకు శ్రేయోభిలాషులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ మండల పరిధిలోని జంగారెడ్డిపల్లి గ్రామ ఉపసర్పంచ్ ఆలకుంట్ల శోభ రాజు శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో శాంతి సౌభాగ్యం సంతోషం ఆరోగ్యం అభివృద్ధితో నిండి ఉండాలని ప్రజల జీవితాలతో ఆనందం పెరగాలని రైతులకు మంచి పంటలు యువతకు ఉపాధి అవకాశాలు విద్యార్థులు విజయాలు మహిళలకు భద్రత వృద్ధులకు ఆదరణ లభించాలని శోభ రాజు కోరారు

పరకాల పట్టణ కేంద్రంలో పడకేసిన అభివృద్ధి

పరకాల మహా: పరకాల మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంగా భారతీయ జనతా పార్టీ పరకాల పట్టణ శాఖ ముఖ్య నాయకుల సమావేశం పట్టణ అధ్యక్షులు గాజుల నిరంజన్ అధ్యక్షతన నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పరకాల నియోజకవర్గం కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డా పగడాల కాళీ ప్రసాద్ రావు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ సిరింగి సంతోష్ కుమార్ పాల్గొన్నారు వారు మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యంలో పరకాలకు జిల్లా విభజనలో తీరని అన్యాయం జరిగిందని పరకాల ప్రాంతం అభివృద్ధి లేక మెయిన్ రోడ్ లో ఉన్న షాపులు టూ లెట్ బోర్డులతో దర్శనం ఇస్తున్నాయని తెలిపారు 100 పడగల ఆసుపత్రి పనులు ఇంకా నత్త నడకనే కొనసాగుతున్నాయని దీనికి కారణం ప్రతిపక్ష పార్టీ మాజీ ఎమ్మెల్యే అధికార పార్టీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అని తెలిపారు మరియు పాత పోస్టుమార్టం రోడ్ ను డెవలప్ చేయాలని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ అని కట్టిన బంగ్లా నిరుపయోగంగా ఉండడం వలన అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా గా మారిందని తెలియజేశారు. పరకాలను దామెర చెరువును మినీ ట్యాంక్ బండ్ గా ఏర్పాటు చేయాలని కోరారు తెలంగాణ ఆర్టీసీ కొత్త బస్ డిపో నిర్మాణం అప్ గ్రేడియేషన్ అధునీకరణలో 108.20 కోట్ల అనుమతులు వచ్చిన అందులో పరకాల పేరు లేదని తెలిపారు రాబోయే మున్సిపల్ ఎలక్షన్స్ లో పరకాల గడ్డమీద భారతీయ జనతా పార్టీ జెండా ఎగరవేయడం ఖాయమని అందుకు తగిన కార్యచరణ చేపడతామని కాళీ ప్రసాద్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జిల్లా ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులు వివిధ మోర్చాల నాయకులు మండల నాయకులు బూత్ అధ్యక్షులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

- న్యాయవాది సారంగపాణి,డిబీఎఫ్ జిల్లా కార్యదర్శి చుంచు నరేష్!
- చుంచు వెంకటేష్ కుటుంబానికి 50 కేజీల బియ్యం అందజేత!
- మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వినతి!

పరకాల మహా: హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం పెద్ద పెండ్యాల గ్రామ నిరుపేద దళిత సామాజిక వర్గానికి చెందిన చుంచు వెంకటేష్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా బుధవారం న్యాయవాది,సామాజిక కార్యకర్త బచ్చలకూర సారంగపాణి, దళిత బహుజన ఫ్రంట్ (డిబీఎఫ్) జిల్లా కార్యదర్శి చుంచు నరేష్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని తెలిపారు.నిరుపేద దళితుడైన చుంచు వెంకటేష్ మృతి చెందడంతో ఆయన కుటుంబానికి తీరని నష్టం వాటిల్లిందని,బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు కేటాయించడంతోపాటు,ఇతర సంక్షేమ పథకాలు అందించి అన్ని విధాలుగా ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.ఇందుకు స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి,ఎంపీ కడియం కావ్య, స్థానిక ప్రజాప్రతినిధులు కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్ నాయకులు బచ్చలకూర గణేష్,చుంచు రాజు, బచ్చలకూర రజిత, గుమ్మడి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు నూతన ఆంగ్ల సంవత్సరాది శుభాకాంక్షలు

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

హన్మకొండ మహా; నూతన ఆంగ్ల సంవత్సరం సందర్భంగా హనుమకొండ జిల్లా, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నూతన ఆంగ్ల సంవత్సరాది శుభాకాంక్షలు తెలిపారు. 2025 సంవత్సరం జిల్లావ్యాప్తంగా అభివృద్ధికి, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు కీలకంగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. గత ఏడాది కాలంలో నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని ఎమ్మెల్యే తెలిపారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, వీధి దీపాల ఏర్పాటు వంటి పనులు వేగంగా పూర్తయ్యాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల్లో మౌలిక వసతుల పెంపుతో విద్యా-వైద్య సేవలు మరింత బలోపేతమయ్యాయని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన నూతన సంక్షేమ పథకాలు పేదలు, మహిళలు, బలహీన వర్గాలకు నేరుగా లాభం చేకూర్చాయని ఎమ్మెల్యే తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి పథకాల ఫలాలు అందేలా పారదర్శకంగా అమలు చేశామని, ప్రజా ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేశామని పేర్కొన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు పెంచే కార్యక్రమాలు, స్వయం ఉపాధి ప్రోత్సాహక చర్యలు కూడా విస్తృతంగా కొనసాగాయని తెలిపారు. 2025 సంవత్సరానికి గాను వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరు, రూ.28 కోట్లతో పాలిటెక్నికల్ కళాశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన, రూ.21 కోట్లతో ATC సెంటర్ ప్రారంభం, రూ.1.50 కోట్లతో ఇండోర్ స్టేడియం మౌలిక వసతుల అభివృద్ధి, రూ.5 కోట్లతో ఎస్డిఎల్సి అడ్మిన్ భవన నిర్మాణానికి నిధుల కేటాయింపు జరిగిందని తెలిపారు. అదేవిధంగా 592 రెండు పడకల ఇళ్లను అర్హులకు పంపిణీ చేయగా, 2000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని చెప్పారు. అకాల వర్షాలతో దెబ్బతిన్న ఇళ్లకు రూ.15,000 చొప్పున ఆర్థిక సహాయం, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరపున రేషన్ పంపిణీ చేశామని వివరించారు. ఎమ్మెల్యే గారి ప్రత్యేక చొరవతో వివిధ ప్రైవేట్ సంస్థల ద్వారా వరద బాధితులకు అదనపు సహాయం అందించామని తెలిపారు. నూతన సంవత్సరం వేడుకలను ప్రజలు ఆనందంగా, బాధ్యతతో జరుపుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, రహదారి భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. అనుమతి లేని బాణాసంచా వాడకాన్ని నివారించాలని, రాత్రి వేళల్లో శబ్ద కాలుష్యం తగ్గించేలా సహకరించాలని తెలిపారు. మహిళలు, పిల్లల భద్రత పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పోలీసులు, మున్సిపల్ అధికారుల సూచనలను ప్రజలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. నూతన సంవత్సరం ప్రతి కుటుంబానికి ఆరోగ్యం, సంతోషం, అభివృద్ధిని తీసుకురావాలని ఆకాంక్షిస్తూ, ప్రజల సహకారంతో వరంగల్ పశ్చిమ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు.

బోడ సుదర్శన్ మరణం ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు

ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు

వలిగొండ, మహా : నిరంతర పోరాటశీలి ప్రజా ఉద్యమాలే ఊపిరిగా పోరాటాలు నిర్వహించిన బోడో సుదర్శన్ మరణం సిపిఐ పార్టీకి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని కొత్తగూడెం శాసనసభ్యులు కూనమనేని సాంబశివరావు అన్నారు బుధవారం వలిగొండ మండలంలోని వేములకొండ గ్రామంలో బోడ సుదర్శన్ సంస్కరణ సభకు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి జిల్లా కార్యదర్శి దామోదర్ రెడ్డి గోదా శ్రీరాములు ఎలగందుల అంజయ్య పోలేపాక యాదయ్య ఎల్లంకి మహేష్ సుద్దాల సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు

చత్రపతి శివాజీ విగ్రహ ధ్వంసం హేయమైన చర్య

- హిందూ తత్వానికి నిలువెత్తు రూపం చత్రపతి శివాజీ
- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు

వరంగల్ మహా; వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని బంధన్ పల్లి గ్రామంలో హిందువుల పరాక్రమానికి నిలువెత్తు రూపం, ధర్మరక్షకుడు అయిన చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని కొందరు గుర్తు తెలియని దుండగులు రాత్రివేళ పిరికిపందల్లా కాల్చి ధ్వంసం చేయడం హేయమైన చర్యగా బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు తీవ్రంగా మండిపడ్డారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి ప్రదీప్ రావు మాట్లాడుతూ, చత్రపతి శివాజీ మహారాజ్ అనేది కేవలం ఒక వ్యక్తి కాదు, దేశ ఆత్మగౌరవానికి, హిందూ సంస్కృతికి ప్రతీక అని అన్నారు. అటువంటి మహానుభావుని విగ్రహం పై దాడి చేయడం ద్వారా కాంగ్రెస్ నాయకులు వారి సంస్కృతి వ్యతిరేకత ను, దేశభక్తి పై ఉన్న వారి కపట ప్రేమను మరోసారి నిరూపించుకున్నారని విమర్శించారు. ఇలాంటి చర్యల పై ప్రభుత్వం తక్షణమే స్పందించి, విగ్రహ ధ్వంసానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తప్పిదం చేసిన వారిని కాపాడే ప్రయత్నం చేస్తే బీజేపీ శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతాయని హెచ్చరించారు. చత్రపతి శివాజీ మహారాజ్ ఆశయాలు, ఆదర్శాలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి పోతాయని, విగ్రహాలను ధ్వంసం చేయడం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆ మహనీయుని గౌరవాన్ని తగ్గించ లేరని స్పష్టం చేశారు.

వరద బాధితులకు ఉచిత బియ్యం పంపిణీ

డివిజన్ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి.. నగర మేయర్ గుండు సుధారాణి

వరంగల్ మహా; మెంథా తుఫాను వల్ల దెబ్బతిన్న వరద బాధితులకు ముఖ్య మంత్రి ఆదేశాల మేరకు ఉచిత బియ్యం పంపిణీ చేస్తున్నట్లు నగర మేయర్ గుండు సుధారాణి తెలిపారు. బల్దియా పరిధిలోని 29 వ డివిజన్ రామన్న పేట లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమం లో భాగంగా మేయర్ బాధితులకు సన్న బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో మెంథా తుఫాను కారణంగా నిరాశ్రయులైన వరద బాధితులకు ఉచితంగా సన్న బియ్యం పంపిణీ తో పాటు 1030 మంది బాధితులను గుర్తించి వారికి రూ.15 వేల ఆర్థిక సహాయం బ్యాంక్ అకౌంట్ లోకి నేరుగా పంపించడం జరుగుతుందని మేయర్ తెలిపారు. అనంతరం డివిజన్ లో క్షేత్ర స్థాయిలో పర్యటించి ఇంజనీరింగ్ శానిటేషన్ పనుల సమర్థనిర్వహణకు సంబంధిత అధికారులకు మేయర్ తగు సూచనలు చేసి డ్రైన్ నిర్మిత పనుల్లో వేగం పెంచాలని విద్యుత్ స్తంభాలను తొలగించాలని మేయర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ సత్యనారాయణ, ఎం హెచ్ ఓ డా.రాజేష్, తహసిల్దార్ శ్రీకాంత్, సానిటరీ సూపర్ వైజర్ గోల్కొండ శ్రీను, తదితరులు, పాల్గొన్నారు.

అంగన్వాడి టీచర్లకు ఫ్రీ స్కూల్ శిక్షణ

పరకాల మహా: ఐసిడిఎస్ పరకాల ప్రాజెక్టు, నాగారం సెక్టార్ ఆధ్వర్యంలో రాకెట్ లెర్నింగ్ ఆర్గనైజేషన్ సహకారంతో మిషన్ బాల ఉద్యమంలో భాగంగా సెక్టార్ అంగన్వాడి టీచర్లకు ప్రీ స్కూల్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అలియాబాద్ అంగన్వాడి కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ శాతరాశి సనత్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మాతా-శిశు సంక్షేమానికి ఐసిడిఎస్ ద్వారా అందిస్తున్న సేవలు ఎంతో ఉపయోగకరమని, గ్రామ ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అంగన్వాడి కేంద్రానికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. నూతన సర్పంచ్‌గా విచ్చేసిన సనత్ కుమార్‌ను ఐసిడిఎస్ నాగారం సెక్టార్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాగారం సెక్టార్ సూపర్వైజర్ జె.రాణి, రాకెట్ లెర్నింగ్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ రిజ్వాన, నాగారం సెక్టార్ అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి పదవి విరమణ సహజం

నగర మేయర్ గుండు సుధారాణి

కమిషనర్ తో కలిసి పదవి విరమణ పొందిన ఉద్యోగులను సన్మానించిన మేయర్....

మహా: ప్రతి ఉద్యోగికి పదవి విరమణ సహజం అని నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి అభిప్రాయపడ్డారు. బల్దియా జే ఏ సి ఆధ్వర్యం లో బుధవారం పదవి విరమణ పొందుతున్న ఇంజనీరింగ్ విభాగానికి చెందిన డి ఎం గ్రేడ్ 3 ఉద్యోగి శ్రీరామచంద్ర మూర్తి పారిశుధ్య కార్మికురాలు గట్టిమొక్కుల సరోజన లకు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి పాల్గొని సత్కరించారు. ఈ సందర్భం గా మేయర్ మాట్లాడుతూ నగర పాలక సంస్థ లో గత 35 సం.లుగా సుదీర్ఘ సేవలు అందించారని కార్పొరేషన్ లో విధి నిర్వహణ అంటే ప్రజలకు సేవ చేసినట్లేనని ఉద్యోగ నిర్వహణ లో ఉన్నత భావం తో సేవలు అందించారని కొనియాడారు.కుటుంబ సభ్యులతో ఉత్సాహం తో శేష జీవితం ఆయురారోగ్యాలతో సంతోషం గా గడపాలని ఆకాంక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ కార్పొరేషన్ లో సేవలు అందించి విరమణ పొందుతున్న ఉద్యోగులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మేయర్ కమిషనర్ లు పదవి.విరమణ పొందిన ఉద్యోగులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమం లో ఎస్ ఈ సత్యనారాయణ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, ఏం హెచ్ ఓ డా.రాజేష్ జే ఏ సి వర్కింగ్ ప్రెసిడెంట్ బాకం సంతోష్ గౌరవ అధ్యక్షులు ధర్మరాజు సూపరిండెంట్ ఆనంద్ ఈ ఈ లు రవికుమార్ సంతోష్ బాబు తదితరులు పాల్గొన్నారు

మంత్రికి స్వాగతం పలికిన వరంగల్ జిల్లా కలెక్టర్

వరంగల్ మహా; భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయం (ఐ డి ఓ సి) లో బుధవారం హన్మకొండ, వరంగల్, భూపాలపల్లి మూడు జిల్లాల కలెక్టర్లతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సమావేశానికి విచ్చేసిన విచ్చేసిన రాష్ట్ర ఎస్సీ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి వర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్వామిని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు.

జర్నలిస్టుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

సంఘాల ది సవతి ప్రేమ..సర్కార్ ది స్నేహ హస్తం

వరంగల్ మహా; పదేళ్లు నిద్రపోయిన యూనియన్ సంఘాలే.. నేడు మొసలి కన్నీరు కారు స్తున్నాయని ఆ ఆందోళనల వెనుక ఉన్నది జర్నలిస్టుల సంక్షేమం కాదని స్వార్థ రాజకీయమే అని ప్రస్తుతం ఉన్న రేవంత్ రెడ్డి సర్కార్ లో జర్నలిస్టుల కోసం ఫ్రెండ్లీ విధానాన్ని అమలు చేస్తుందని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ స్పష్టీకరణ చేసింది. కమిషనర్ తో భేటీలో సమస్యల పరిష్కారం పై టీఎస్ జేయూ యూనియన్ కు పక్కా హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న అక్రిడిటేషన్ రగడకు కారణం ప్రభుత్వం కాదని దశాబ్దాలుగా వ్యవస్థను శాసిస్తున్న కొన్ని యూనియన్ల స్వార్థమే నని గత బి. ఆర్. ఎస్. ప్రభుత్వ హయాంలో పదేళ్లుగా పెదవి విప్పని, పాదం కదపని నాయకులు.. ఇప్పుడు చేస్తున్న ధర్నాలు కేవలం 'కపట నాటకాలు' మాత్రమేనని రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాత్రం జర్నలిస్టుల పట్ల అత్యంత సానుకూలంగా ఉంది" అని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ స్పష్టం చేసింది. మంగళవారం సమాచార శాఖ కమిషనర్ ను కలిసిన అనంతరం టి.ఎస్.జే.యు. నాయకులు మాట్లాడుతూ.. సంఘాల మోసాన్ని నమ్మొద్దని గత ప్రభుత్వ హయాంలో జర్నలిస్టు నిధులు పక్కదారి పడుతున్నా, ఇన్సూరెన్స్ ఆగిపోయినా చోద్యం చూసిన కొన్ని సంఘాలు.. ఇప్పుడు తమ ఉనికిని కాపాడుకోవడానికి ప్రభుత్వంపై బురద చల్లుతున్నారు. జీవో రూపకల్పనలో లోపాలకు కారణం ఆ సంఘాల తప్పుడు సలహాలే. ఇప్పుడు జర్నలిస్టులు తిరగబడేసరికి.. ప్లేట్ ఫిరాయించి ఆందోళనల పేరుతో కొత్త డ్రామాలు ఆడుతున్నాయి. జర్నలిస్టులు ఈ మోసాన్ని గమనించాలని టి.ఎస్.జే.యు హెచ్చరించింది.

ప్రభుత్వం సానుకూలం - కమిషనర్ భరోసా

"జర్నలిస్టుల సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా వారి స్పందన చాలా సానుకూలంగా ఉందని అర్హులైన జర్నలిస్టులకు అన్యాయం చేయడం ప్రభుత్వ ఉద్దేశం కాదని, గత పాలకులు చేసిన తప్పులను సరిదిద్ది అందరికీ న్యాయం చేస్తామని వారు భరోసా ఇచ్చారని తెలిపారు.

చర్చల్లోని ముఖ్యాంశాలు - విజయాలు

ఇన్సూరెన్స్ పక్కా: జర్నలిస్టుల కుటుంబాలకు రక్షణగా నిలిచే 'గ్రూప్ ఇన్సూరెన్స్' పథకాన్ని పునరుద్ధరించేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉందని, త్వరలోనే దీనిపై నిర్ణయం వెలువడుతుందని తెలిపారు.

డెస్క్ జర్నలిస్టులకు గుర్తింపు

క్షేత్రస్థాయి జర్నలిస్టులతో సమానంగా డెస్క్ జర్నలిస్టులకు కూడా ప్రభుత్వ పథకాలు, అక్రిడిటేషన్ వర్తింపజేసేలా జీవోలో మార్పులు చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

చిన్న పత్రికలకు న్యాయం

గతంలో మాదిరిగా కాకుండా, చిన్న పత్రికల ఎంపానెల్మెంట్ ప్రక్రియను సరళతరం చేసి, వాటికి అండగా ఉంటామని ప్రభుత్వం చెప్పినట్లు వెల్లడించారు.

ప్రజా ప్రభుత్వం పై నమ్మకం ఉంది

కొన్ని సంఘాలు చేస్తున్న విష ప్రచారాన్ని నమ్మవద్దని, రేవంత్ రెడ్డి గారి ప్రభుత్వం జర్నలిస్టుల పక్షపాతని.. త్వరలోనే అన్ని సమస్యలకు సానుకూల పరిష్కారం లభిస్తుందని టి.ఎస్.జే.యు. ఆశాభావం వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో టి.ఎస్.జే.యు. రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం నారగౌని , ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ తోకల, ఆర్గనైజింగ్ సెక్రటరీ క్రాంతి పాల్గొన్నారు.

విద్యార్థులకు మార్గదర్శకులు ఉపాధ్యాయులే...

మందల తిరుపతిరెడ్డి పిఆర్టియు హనుమకొండ జిల్లా శాఖ అధ్యక్షులు

పరకాల మహా: నడికూడ మండలం కౌకొండ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఓడపల్లి విజయకుమార్ పదవీ విరమణ సన్మాన కార్యక్రమం జరిగింది ఈ సన్మాన కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్ఞాన ప్రసూనాంబ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా పిఆర్టియు హన్మకొండ జిల్లా శాఖ అధ్యక్షులు మండల తిరుపతిరెడ్డి మరియు ప్రధాన కార్యదర్శి పలిత శ్రీహరి ఇచ్చేశారు. పిఆర్టియు హనుమకొండ జిల్లా శాఖ అధ్యక్షులు మండల తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి జీవితంలో ఉపాధ్యాయుల పాత్ర చిరస్మరణీయంగా మిగిలి పోతుందని, ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని అన్నారు. ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని, ఉద్యోగ నిర్వహణలో ఆయన చేసిన సేవలు పేరు ప్రఖ్యాతలు తీసుకొస్తాయన్నారు. అన్ని ప్రభుత్వ ఉద్యోగుల కంటే ఉపాధ్యాయ వృత్తి చాలా కష్టతరంతో కూడుకుందన్నారు. విద్యార్థుల భవిష్యత్ దిశా నిర్దేశం చేయడంలో కీలకంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా విజయకుమార్ చేసిన సేవలను ఆయన కొనియాడారు. అనంతరం విజయకుమార్ ని ఘనంగా సన్మానించారు.

గజ్ క్రెడిట్ కార్డు గురించి తెలుసా?

ముంబై: సంపన్న కస్టమర్ల కోసం ప్రైవేట్ రంగ ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ తాజాగా గజ్ (Gaj) పేరిట ప్రీమియం మెటల్ కార్డును ప్రవేశపెట్టింది. ప్రైవేట్ బ్యాంకింగ్ కస్టమర్ల కోసం ఉద్దేశించిన ఈ కార్డుపై జాయినింగ్, వార్షిక ఫీజు రూ. 12,500గా (జీఎస్టీ అదనం) ఉంటుంది. 12,500 ఇన్విటేషన్ రివార్డు పాయింట్లతో ఇది లభిస్తుంది. 1 రివార్డు పాయింటు రూ. 1కి సమానంగా ఉంటుంది. వీటిని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ యాప్ ద్వారా ట్రావెల్ బుకింగ్స్‌పై వీటిని రిడీమ్ చేసుకోవచ్చు. వార్షికంగా రూ. 10 లక్షలు ఖర్చు చేస్తే వార్షిక ఫీజు నుంచి మినహాయింపు ఉంటుంది. జీరో ఫారెక్స్ మార్కప్, గ్లోబల్ ఏటీఎంలలో వడ్డీరహితంగా నగదు లభ్యత, రూ. 50,000 వరకు విలువ చేసే ట్రిప్ క్యాన్సిలేషన్ కవరేజీ మొదలైన ప్రత్యేకతలు ఇందులో ఉంటాయి. ప్రీమియం మెటల్ క్రెడిట్ కార్డుల త్రయం 'అశ్వ-మయూర-గజ'లో భాగంగా ఇది ఉంటుందని బ్యాంకు పేర్కొంది.

కేంద్రం కీలక ప్రకటన
వొడాఫోన్ ఐడియాకు బిగ్ రిలీఫ్!

రుణభారంతో సతమతమవుతున్న 'వొడాఫోన్ ఐడియా'కు కేంద్ర ప్రభుత్వం ఉపశమనం కల్పించింది. సర్దుబాటు చేసిన స్థూల రాబడి (AGR) బకాయిలు రూ. 87,695 కోట్లను ఫ్రీజ్ చేసింది. అంతే కాకుండా.. 2032 ఆర్థిక సంవత్సరం నుంచి 2041 ఆర్థిక సంవత్సరం వరకు.. 10 సంవత్సరాల కాలంలో వారి తిరిగి చెల్లించేలా వెసులుబాటు కల్పించింది. ఏజీఆర్ సంబంధిత అంశాలు.. కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉన్నందున, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పునఃపరిశీలించాలని 2020లోనే సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అప్పటి నుంచి ప్రభుత్వ మద్దతు కోసం వేచిచూస్తున్న వొడాఫోన్ ఐడియాకు కేంద్రం తీసుకున్న నిర్ణయం ఊరట కలిగించింది.

వోడాఫోన్ ఐడియాలో.. ప్రభుత్వానికి 49% వాటా ఉంది. అయితే ఇప్పుడు కేంద్రం తీసుకున్న నిర్ణయం ప్రభుత్వానికి బకాయిల చెల్లింపును క్రమబద్ధీకరించడానికి వీలు కల్పించడమే కాకుండా.. కంపెనీకి చెందిన 20 కోట్ల మంది వినియోగదారుల ప్రయోజనాలను కూడా కాపాడుతుంది.

చెక్కుల తక్షణ క్లియరెన్స్ రెండో దశ వాయిదా

చెక్కుల చెల్లింపులను వేగవంతం చేసే రెండో దశ అమలును ఆర్‌బీఐ వాయిదా వేసింది. చెక్కుల తక్షణ క్లియరెన్స్‌కు వీలుగా బ్యాంక్‌లు తమ కార్యకలాపాలను మరింత క్రమబద్ధీకరించుకునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆర్‌బీఐ ప్రకటించింది. తదుపరి నోటీస్ జారీ చేసే వరకు ఇది కొనసాగుతుందని పేర్కొంది. వాస్తవానికి అయితే జనవరి 3 నుంచి రెండో దశను బ్యాంక్‌లు అమలు చేయాల్సి ఉంది. వేగంగా చెక్కుల చెల్లింపులకు (క్లియరెన్స్) సంబంధించి మొదటి దశ అక్టోబర్ 4 నుంచి అమల్లో రావడం గమనార్హం. అయితే మొదటి దశ అమలులో కొన్ని సమస్యలు ఎదురుకావడంతో రెండో దశను వాయిదా వేసినట్టు తెలుస్తోంది. మొదటి దశకు ముందు చెక్కుల చెల్లింపులు పూర్తయ్యేందుకు రెండు రోజుల వరకు సమయం పట్టేది. ఇప్పుడు మొదటి దశలో భాగంగా గంటల్లోనే చెల్లింపులు పూర్తవుతున్నాయి. మొదటి దశలో భాగంగా చెక్కుల సమర్పణ సమయాన్ని ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలకు ఆర్‌బీఐ తాజాగా సవరించింది. ఇప్పటి వరకు ఇది ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంది. చెక్కుల ధ్రువీకరణ సమయాన్ని సైతం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటలకు సవరించింది.

రైల్లో పోయిన ఐప్యాడ్ దొరికిందిలా..

రైల్లో ప్రయాణించేటప్పుడు.. కొన్ని సందర్భాల్లో విలువైన వస్తువులు, ఎలక్ట్రానిక్స్ ఇతరత్రా మరిచి పోయే అవకాశం ఉంది. వాటిని తిరిగి పొందటం ఒకప్పుడు కష్టంగా ఉండేది. అయితే ఇప్పుడున్న టెక్నాలజీకి అదేం పెద్ద కష్టమేమీ కాదు. ఇలాంటి సంఘటన ఇటీవల వెలుగులోకి వచ్చింది. డిసెంబర్ 27న దక్షిణ్ ఎక్స్‌ప్రెస్‌లో భోపాల్‌కు వెళుతున్నప్పుడు తన ఐప్యాడ్‌ను మర్చిపోయానని ఎక్స్ యూజర్ 'దియా' వెల్లడించారు. ట్రైన్ దిగిన ఒక గంట తరువాత మరిచిపోయిన విషయం గ్రహించి, చాలా బాధపడినట్లు ఆమె వెల్లడించారు. రైల్లో మరిచిపోయిన తన ఐప్యాడ్ తిరిగిపొందటానికి.. రైల్వే హెల్ప్‌లైన్ (#139)కు కాల్ చేసి, RailMadad యాప్ ద్వారా ఫిర్యాదు చేసింది. దీనికి స్పందించిన సిబ్బంది.. ట్రైన్ వివరాలు, కోచ్ నెంబర్ ఆధారంగా ఆమె ఐప్యాడ్ గుర్తించారు. ఆ తరువాత ఆమెకు కాల్ చేసి దానిని అప్పగించారు. ఈ విషయాన్ని దియా తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. ఐప్యాడ్ తిరిగి పొందటంతో దియా చాలా సంతోషించింది. సిబ్బందికి కృతజ్ఞత చెబుతూ.. మరో ట్వీట్ చేశారు. దీనిపై నెటిజన్లు స్పందిస్తూ.. తమకు ఎదురైన సంఘటనల గురించి కూడా వెల్లడించారు.

రెండు లక్షల మంది కొన్న కారు ఇది

హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్.. 2025వ సంవత్సరాన్ని సరికొత్త రికార్డుతో ముగించింది. కంపెనీకి చెందిన క్రెటా 2,00,000 యూనిట్లకు పైగా అమ్మకాలను నమోదు చేసింది. భారతదేశంలో దాని విభాగంలో.. అత్యంత పోటీ ఉన్నప్పటికీ మంచి అమ్మకాలను సాధించగలిగింది. 2025లో హ్యుందాయ్ రోజుకు 550 క్రెటా కార్లను విక్రయించింది. అంటే.. మార్కెట్లో ఈ కారుకు ఎంత డిమాండ్ ఉందో స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు. మొత్తం మీద హ్యుందాయ్ క్రెటా గత ఐదు సంవత్సరాలుగా (2020-2025) భారత దేశంలో అత్యధికంగా అమ్ముడైన SUVగా అవతరించింది. మిడ్‌సైజ్ SUV విభాగంలో 34 శాతానికి పైగా కమాండింగ్ మార్కెట్ వాటాతో, దాని పోటీదారుల కంటే అమ్మకాల్లో చాలా ముందుంది. క్రెటా రెండు లక్షల కంటే ఎక్కువ అమ్మకాలను పొందిన సందర్భంగా.. హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ & సీఈఓ డిజిగ్నేట్ తరుణ్ గార్గ్ మాట్లాడుతూ.. భారతదేశంలో హ్యుందాయ్ క్రెటా ప్రయాణం అసాధారణమైనది. 2 లక్షల యూనిట్లకు పైగా వార్షిక అమ్మకాలను సాధించడం అనేది చాలా గొప్ప విషయం అని అన్నారు.



దేశం-విదేశం
NATIONAL-INTERNATIONAL

గుర్తిస్తే కఠిన చర్యలు

మస్కట్: వర్క్ పర్మిట్లు, వృత్తిపరమైన లైసెన్స్, సర్టిఫికెట్లపై ఒమన్ దేశం కీలక హెచ్చరికలు జారీ చేసింది. నకిలీ వర్క్ పర్మిట్లు, జాబ్ లైసెన్స్ పత్రాలను సమర్పిస్తే చర్యలు తప్పవని హెచ్చరించింది. దీనికి సంబంధించి నకిలీని సర్టిఫికెట్లు ఎక్కువగా వ్యాప్తి చెందుతున్నాయని కార్మిక మంత్రిత్వ శాఖ గుర్తించింది. ఈ నేపథ్యంలోనే కొత్త సంవత్సరంలో నిబంధనలను కఠినతరం చేసింది. ఫేక్ సర్టిఫికెట్లు, కాపీలు లాంటి చర్యలు చట్టాలు, నిబంధనలను స్పష్టంగా ఉల్లంఘించడమేనని, కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఒమన్‌లో పని అనుమతులు (వీసాలు) పునరుద్ధరించడానికి, కొత్త ఉద్యోగాలలోకి ప్రవేశించడానికి, సంబంధిత రంగాలలో వృత్తిపరమైన వర్గీకరణ సర్టిఫికెట్లు, వృత్తిపరమైన అభ్యాస లైసెన్స్‌లను సమర్థ అధికారుల (సెక్టోరల్ స్కిల్స్ యూనిట్లు) నుండి పొందాలని స్పష్టం చేసింది.అదే సమయంలో, అన్ని ఉద్యోగులు, కంపెనీలు ఈ పత్రాలు జారీ చేసే క్రమంలో వాటి ప్రామాణికతను ధృవీకరించాల్సిన బాధ్యత ఉందని తెలిపింది. ఏదైనా అనధికార పత్రాలను ఉపయోగించకుండా అప్రమత్తంగా ఉండాలని మంత్రిత్వ శాఖ పేర్కొంది. ప్రొఫెషనల్ వర్గీకరణ సర్టిఫికేట్, వృత్తిని అభ్యసించడానికి లైసెన్స్ ముఖ్యమైనవి. ఉద్దేశించిన వృత్తికి సంబంధిత వ్యక్తి సుముఖత, అర్హతను ధృవీకరించడం, వృత్తిపరమైన సామర్థ్యం, పనితీరు ప్రమాణాలను నిర్ధారించడం, కార్మిక మార్కెట్‌ను నియంత్రించడం వృత్తిపరమైన ప్రమాణాలను నిర్ధారించడమే దీని లక్ష్యమని పేర్కొంది. నకిలీ లేదా తప్పుడు పత్రాన్ని సృష్టించడం నేరస్థుడిపై చట్టపరమైన చర్యలకు దారితీసుకుంటామని హెచ్చరించింది. చట్టాలని లోబడి జరిమానా, ఇతర చర్యలుంటాయని మంత్రిత్వ శాఖ పేర్కొంది.

తవ్వకాల్లో 500 ఏళ్ల ఓడ..

ఆఫ్రికాలో 500 సంవత్సరాల పురాతన ఓడ ఏడారిలో జరిపిన తవ్వకాల్లో శాస్త్రవేత్తలకు లభ్యమయ్యింది. అయితే సముద్ర గర్భంలో ఉండాల్సిన నౌక ఇంత భారీ పరిమాణం గల నౌక ఇసుక ఏడారిలోకి ఎలా వచ్చిందబ్బా అని వారు తొలుత హవాక్కయ్యారు. తాజాగా అందులో అపారమైన బంగారం. వెండితో పాటు పెద్ద మొత్తంలో ఖజానా దొరికింది. 2008 సంవత్సరంలో ఆఫ్రికాలోని నమీబియాలో నమీబ్ ఏడారిలో వజ్రాల కోసం శాస్త్రవేత్తలు తవ్వకాలు జరిపారు. అప్పుడు ఆశ్చర్యకరంగా 500 సంవత్సరాల పురాతన బోమ్ జీసస్ అనే నౌకను శాస్త్రవేత్తలు కనుగొన్నారు. అందులో దాదాపు 2వేల బంగారు నాణేలు, వెండి నాణేలు, వందల కిలోగ్రాములు రాగి కడ్డీలు ఇతర జంతువుల దంతాలు లభించాయి. దీంతో దానిపై పురావస్తు శాస్త్రవేత్తలు దానిపై పరిశోధన జరపగా అది వాణిజ్య నౌకగా గుర్తించారు. అయితే ఆ నౌక 1533 సంవత్సరంలో ఆఫ్రికా నుంచి భారత్‌కు వాణిజ్యానికి వెళుతోందని తెలిపారు. ఆ సమయంలో నమిబీయా తీరాన్ని తీవ్ర మంచుతుపాను తాకడంతో ఓడ రాళ్లను ఢీకొట్టి మునిగిపోయి ఉండవచ్చని శాస్త్రవేత్తలు అనుమానిస్తున్నారు. ఆ సమయంలో ఓడలో ప్రయాణించిన వారి అవశేషాలు ఎక్కడ లభ్యం కాలేదు ఈ విషయం వారికి ఇప్పటికీ రహస్యంగానే ఉంది.

మిమ్మల్ని ఓటర్ల జాబితా ఆయుధంగా మార్చారు

న్యూఢిల్లీ: ఎలక్షన్ కమిషన్‌పై తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) మరోసారి ధ్వజమెత్తింది. కొత్త ఏర్పాటైన 'సర్'తో ఓటర్ల జాబితాలో తారుమారు జరుగుతుందంటూ మండిపడింది. ఈరోజు(బుధవారం, డిసెంబర్ 31) సీఈసీని టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ.. కలిసి పశ్చిమబెంగాల్ ఓటర్ల జాబితా సవరణ అంశానికి సంబంధించి నివేదిక సమర్పించారు. అనంతరం సీఈసీతో చర్చించారు. అయితే ఆపై బయటకొచ్చిన అభిషేక్ బెనర్జీ.. సీఈసీ టార్గెట్ తీవ్ర విమర్శలు చేశారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌గా ఉన్న జ్ఞానేష్ కుమార్‌ను.. బీజేపీ నేతృత్వంలోని కేంద్రం ఇష్టమొచ్చినట్లు వాడుకుంటుందని ఘాటు వ్యాఖ్యలుచేశారు. దేశాన్ని విచ్చిన్నం శక్తిగా జ్ఞానేష్ కుమార్‌ను కేంద్రం ఉపయోగించుకుంటుందన్నారు. తమకు ఈవీఎంల ఓటింగ్‌తో ఎటువంటి సమస్యా లేదని, కానీ ఓటర్ల జాబితాను తారుమారు చేస్తున్నారనే అనుమానం మాత్రం ఉందన్నారు. ' మా ప్రశ్నలకు దేనికి కూడా సీఈసీ సరైన క్లారిటీ ఇవ్వలేదు. సుమారు 20 ప్రశ్నల వరకూ సీఈసీని అడిగాం. కానీ వాటిలో స్పష్టత లేదు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్‌ను ఓటర్ల జాబితా ఆయుధంగా ఉపయోగించుకుంటున్నారు. మీరు తయారు చేస్తున్న ఓటర్ల జాబితాను ప్రజల ముందు బహిర్గతం చేయండి. కనీసం అది కుదరకపోతే..దాన్ని లాజికల్‌గానైనా నిరూపించండి. ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకత లేదనేది మా అనుమానం' అని విమర్శించారు.

బాలనటి ఇంట్లో తీరని విషాదం, కళ్లముందే..!

ముంబైలో జరిగిన ఒక ఘోర బస్సు ప్రమాదం ఒక బాలనటి కుటుంబంలోనూ, ఆ చిన్నారి జీవితంలో మర్చిపోలేని విషాదాన్ని నింపింది. ఒక మూవీ ఆడిషన్‌కోసం వెళ్లిన 13 ఏళ్ల మరాఠీ బాలనటి చాలా ఉత్సాహంగా తిరిగి ఇంటికి బయలుదేరింది. కానీ అదే తన జీవితంలో అంతులేని శోకాన్ని మిగులుస్తుందని ఊహించలేదు. కళ్లముందే కన్న తల్లి ప్రాణాలు పోతోంటే.. ఏమీ చేయలేని అసహాయ స్థితిలో ఉండిపోయింది. పదే పదే ఆ దృశ్యాల్ని తలుచుకొని కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం ముంబైలోని భాండుప్‌లో బెస్ట్ రూట్ 606లో ఒక ఎలక్ట్రిక్ ఏసీ బస్సు అదుపు తప్పి బస్టాప్‌లో నిల్చున్న ప్రయాణికులపై దూసుకెళ్లింది. 35 ఏళ్ల ప్రణీత సందీప్ రసం, తన కుమార్తెను ఆడిషన్ కోసం దాదార్ వెళ్లి తిరిగి వస్తూ, భాండుప్ రైల్వే స్టేషన్ సమీపంలో దిగి బస్ కోసం వెయిట్ చేస్తున్నారు ఇంతలో బస్సు అదుపు తప్పిన బెస్ట్ ఎలక్ట్రిక్ బస్ తమవైపు దూసుకు రావడాన్ని గ్రహించిన తల్లి ప్రణిత, కుమార్తెను శక్తి కొలదీ పక్కకు తోసేసింది.

క్షణాల్లో అంతా జరిగిపోయింది.

తల్లి పక్కకు నెట్టివేయడంతో బాలనటి ప్రమాదం నుంచి స్వల్ప గాయాలతో తృటిలో తప్పించుకుంది. కానీ ప్రణీత మాత్రం బస్సు చక్రాల కింద నలిగి పోయింది. తన కళ్లముందు తల్లి విగతజీవిగా మారిపోవడం ఆమెను తీవ్ర దిగ్భ్రాంతిలోకి నెట్టేసింది. ఎలాగోలా తేరుకుని, వేరే వారి ఫోన్ ద్వారా తండ్రి సందీప్‌కు ఫోన్ చేసింది. ఆయన సంఘటనా స్థలానికి చేరుకునే సమయానికి ప్రణీత గాయాలతో మరణించింది. తల్లి తనను కాపాడుతూ చనిపోయిందంటూ కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న బాలనటిని ఓదార్చడం ఎవ్వరి తరం కాలేదు. చికిత్స, కౌన్సెలింగ్ కోసం ఆమెను ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రణీత కుమార్తె మరాఠీ టీవీ సీరియల్స్‌లో చిన్న సహాయక పాత్రల్లో నటిస్తూ మంచి పేరు తెచ్చుకుంది. హోంవర్క్, షూటింగ్‌లను మేనేజ్ చేస్తూ నటించి పేరు తెచ్చుకున్న ఆమె ప్రతిభ వెనుక ప్రణిత కృషిచాలా ఉందని పొరుగువారు గుర్తు చేసుకున్నారు. పాపను ఆడిషన్స్, సెట్స్‌కు తీసుకెళుతూ ఇంటిని చక్కబెట్టుకొనేదని చెప్పారు. కాగా ఈ ప్రమాదంలో మొత్తం నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ప్రణీతతోపాటు, మాన్సి మేఘశ్యాం గురవ్, 49, వర్ష సావంత్, 25, మరియు ప్రశాంత్ దత్తు షిండే, 45. మరో పదకొండు మంది గాయపడ్డారు. ఈ ఘటనలో ఎలక్ట్రిక్ బస్సు డ్రైవర్, 52 ఏళ్ల సంతోష్ రమేష్ సావంత్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాన్ని తెలుసుకునేందుకు తదుపరి దర్యాప్తు జరుగుతోందని పోలీసులు తెలిపారు.

రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా

ఈ ప్రమాదంలో చిక్కుకున్న వాహనం విఖ్రోలి డిపోకు అనుబంధంగా ఉన్న రూట్ A606 (సీనియర్ 34)లో నడుస్తున్న వెట్ లీజ్ ఒలెక్ట్రా బస్సు. సంఘటన జరిగిన సమయంలో డ్రైవర్ సంతోష్ రమేష్ సావంత్ (52), కండక్టర్ భగవాన్ భావు ఘురే (47) విధుల్లో ఉన్నారని, ఇద్దరూ బెస్ట్ సిబ్బంది గా భావిస్తున్నారు. మరోవైపు మృతుల కుటుంబాలకు మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

నయన్ చేతిలో గన్.. లుక్ అదిరింది!

యశ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'టాక్సిక్'. మలయాళ దర్శకురాలు గీతూమోహన్ దాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం నుంచి తాజాగా నయనతార ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు. ఇందులో ఆమె గంగ అనే పాత్రలో కనిపించనున్నారు. ఒక భారీ క్యాసినో బ్యాక్‌డ్రాప్‌లో.. మోడ్రన్ డ్రెస్‌లో గన్ పట్టుకొని పవర్‌ఫుల్ లుక్స్‌తో నయన్ ఎంతో స్టైలిష్‌గా కనిపించారు. ఆమె హావభావాలు సినిమాలోని ఇంటెన్సిటీని, భారీతనాన్ని తెలియజేస్తున్నాయి. ఈ పాత్ర గురించి డైరెక్టర్ గీతు మోహన్ దాస్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'టాక్సిక్'లో నయనతార సరికొత్త నటనా ప్రతిభను చూస్తారు. షూటింగ్ జరుగుతున్న కొద్దీ గంగ పాత్ర ఆత్మకు, నయనతార వ్యక్తిత్వానికి చాలా దగ్గరి పోలికలు ఉన్నాయని నేను గమనించాను' అని ఆమె అన్నారు. ఈ చిత్రంలో నయనతారతో కలిపి మొత్తం ముగ్గురు హీరోయిన్లు నటిస్తున్నారు. ఇప్పటికే కియరా అద్వానీ, హ్యూమా ఖురేషీకు సంబంధించిన ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. కియారా..నదియా పాత్రలో కనిపించగా, ఖురేషీ ఎలిజబెత్ పాత్రలో అలరించనున్నారు. వచ్చే ఏడాది మార్చి 19న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది.



దిమ్మ దిరిగేలా స్పిరిట్ ఫస్ట్ లుక్

సందీప్ రెడ్డి వంగా, ప్రభాస్ కాంబోలో వస్తున్న మూవీ స్పిరిట్.. ఈ పాన్ ఇండియా మూవీపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు ఉన్నాయి... జనవరి 1 రాత్రి 12 గంటలకు ఎక్స్ వేదికగా డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. వైల్డ్ లుక్‌లో ఉన్న ప్రభాస్‌ను చూసి ఫ్యాన్స్ మతిపోతుంది.. టీ సిరీస్, భద్రకాళీ పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం భారీ బడ్జెట్‌తో రూపొందుతుంది. ప్రభాస్ హీరోగా నటిస్తున్న ఈచిత్రంలో త్రిప్తి దిమ్రి, ప్రకాష్ రాజ్, వివేక్ ఒబెరాయ్ మరియు కాంచన లాంటి సీనియర్ నటులు ఉన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com